

'సోమశిల'కు ఆగిన ఇన్‌ఫ్లో!

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా ఆగిపోయింది. దీంతో డ్యాంలో 28.798 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,350, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.



బ్యాటరీయే బెటర్!

ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న క్రేజ్ ● ఆకట్టుకునే మోడళ్లు, ఫీచర్స్‌తో అందుబాటులో

• ఆదివారం ప్రత్యేకం

ఆకాశాన్ని తాకుతున్న ఇంధన ధరలను చూసి వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటిలో నుంచి వాహనం బయటకు తీయాలంటేనే జంకుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికితోడు వాహనాల నుంచి వెలుగువడుతున్న కాలుష్యం భావితరాలను భయం గుప్పెట్లోకి నెట్టేసింది. ఈ పరిస్థితుల్లో ఎలక్ట్రికల్ వాహనాలు అన్ని వర్గాల ప్రజలకు ఊరటనిచ్చాయి. రెండేళ్ల క్రితం వరకూ ఎలక్ట్రికల్ వాహన వినియోగదారులు జిల్లాలో రెండు శాతం కూడా ఉండేవారు కాదు. అయితే, ప్రస్తుతం ఆ సంఖ్య 25 నుంచి 31 శాతానికి చేరుకుంది. ప్రధానంగా ద్విచక్ర వాహనాలు, కార్లనే అధికంగా కొనుగోలు చేస్తున్నారు. వీటితోపాటు ఎలక్ట్రికల్ ఆటోలు, లగేజి వాహనాలు, బస్సుల విక్రయాలూ జోరందుకుంటున్నాయి. వాటి ధరలు కూడా సాధారణ బండ్లకు సమానంగానే ఉన్నా మెయింటెనెన్స్ చాలా తక్కువగా ఉంటోంది. గత ఏడాది జూన్ వరకు కేంద్ర ప్రభుత్వం ఈ వాహనాలకు సబ్సిడీ అధికంగా ఇచ్చేది. అయితే జూన్ తర్వాత బాగా తగ్గించడంతో కొంతమేర అమ్మకాలు తగ్గినా దసరా నుంచి విక్రయాలు ఊపందుకున్నట్లు షోరూమ్‌ల యజమానులు చెబుతున్నారు.

స్కూటీలకు ఆదరణ అదుర్స్..


ఊపందుకున్న కార్ల విక్రయాలు

వ్యాపారులకు వరంగా ఈ ఆటోలు

వాహనదారులకు అందుబాటులో చార్జింగ్ పాయింట్లు

● పుట్టగొడుగుల్లా షోరూమ్‌లు

జిల్లాలో ఎలక్ట్రికల్ వాహనాలు విక్రయించే షోరూమ్‌లు పదుల సంఖ్యల్లో వెలిశాయి. అయితే, అన్‌రిజిస్టర్ వాహనాల కంపెనీలు మాత్రం పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్నాయి. ఏథర్, టీవీఎస్ హైక్యూబ్, వోలా, బజాజ్ చేతక్, ప్యూర్ వంటి కంపెనీలు ఈ స్కూటీలను విక్రయిస్తున్నా యి. కొత్త మోడళ్లలో అనేక ఫీచర్స్‌తో ఈ స్కూటీలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. రిజిస్ట్రేషన్‌కు చెందిన ఈ స్కూటీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీని తొలగిస్తే రూ.1.25 లక్షల నుంచి రూ.1.9 లక్షల వరకు ధర ఉంటుంది. 90 కి.మీ వేగంతో 210 కిలోల బరువుతో ప్రయాణించవచ్చు. విద్యుత్ చార్జింగ్ ద్వారా బ్యాటరీలకు చార్జింగ్ చేసుకో వాల్సి ఉంటుంది. పబ్లిక్ చార్జింగ్ పాయింట్లలో చార్జింగ్ చేయిస్తే 45 నిమిషాలకు బ్యాటరీ ఫుల్ అవు తుంది. ఇళ్లలో కరెంట్ అయి తే 4 నుంచి 6 గంటల సమయం పడుతుంది. ఒక్కసారి బ్యాటరీ ఫుల్‌గా చార్జింగ్ పెడితే 110 కి.మీ దూరం ప్రయాణించవచ్చు. బ్యాటరీ ఫుల్ అయ్యేందుకు 3 నుంచి 4 యూనిట్లలోపు కరెంట్ ఖర్చు అవుతుంది. ఈ వాహనాలకు ఫైనాన్స్ సదుపాయం కూడా ఉంటుంది.



● జాగ్రత్తలు తప్పనిసరి

ఆడ, మగ అని తేడా లేకుండా ఈ స్కూటీలు నడిపే అవకాశం ఉండటంతో ఆదరణ పెరుగుతోంది. నగరం, పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ఈ స్కూటీలను వినియోగిస్తున్నారు. ప్రధానంగా వ్యాపారులు ఈ స్కూటీలను కొనుగోలు చేసి మార్కెట్‌లకు వెళ్లి సామాన్లు తెచ్చుకునేందుకు వీలుగా ఎక్స్‌ట్రా ఫిట్టింగ్‌లు చేయించుకుంటున్నారు. అయితే, ఈ వాహనాలను వాడే సందర్భంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మెకానిక్‌లు చెబుతున్నారు. ప్రతి 5వేల కిలోమీటర్లకు ఒకసారి సర్వీస్ చేయించుకోవాలి. టైరు ప్రెజర్ జాగ్రత్తగా చూసుకోవాలి. చార్జర్ నీళ్లలో తడపకూడదు. వాటర్ సర్వీస్ చేయించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవలి. బెల్ట్, బ్రేక్ ప్యాడ్, చార్జర్ల రిపేర్లు ఎక్కువగా ఉంటాయి. బ్యాటరీకి 3 నుంచి ఐదేళ్ల వారంటీ ఉంటుంది.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)



● కార్లకు పెరుగుతున్న డిమాండ్

ఐదేళ్ల క్రితమే ఈ కార్లు మార్కెట్లోకి వచ్చినా బ్యాటరీ కెపాసిటీ తక్కువగా ఉండటంతో వాహనదారులు అంతగా ఇష్టపడలేదు. అయితే, తయారీ కంపెనీలు పెరగడం, పోటీతత్వంతో అనేక ఫీచర్స్‌తో ఎలక్ట్రిక్ కార్లు మార్కెట్లో వచ్చేశాయి. ప్రస్తుతం ఈ కార్లు రూ.8 లక్షల నుంచి 5 కోట్ల వరకు ధర పలుకుతోంది. చార్జింగ్ పాయింట్లు కూడా విస్తరిస్తుండటంతో వాహనదారులు కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 230 నుంచి 460 కిలోమీటర్ల వరకు ప్రయాణించే అవకాశం ఉంది. ఇక ఈ ఆటోలకు మార్కెట్‌లో ఇప్పుడిప్పుడూ డిమాండ్ పెరుగుతోంది. తక్కువ మెయింటెనెన్స్‌తో అధిక బరువులు తీసుకు వెళ్లే ఆటోలు వచ్చేశాయి. ప్రముఖ కంపెనీలు ఈ ఆటోలను మార్కెట్‌లోకి దింపుతున్నారు.



తిరుపతికి ఈ బస్సుల్లో..

నెల్లూరు నుంచి తిరుపతికి ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. తిరుపతి రీజియన్‌కు చెందిన 12 ఈ బస్సులు నెల్లూరు 2వ డిపో పర్యవేక్షణలో నడుస్తున్నాయి. రెండవ డిపో గ్యారేజ్‌లో ఈ బస్సుల కోసం ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. రూ.250 చార్జీ వసూలు చేస్తున్నారు. శబ్దం లేకుండా, కాలుష్యం వెదజల్లకుండా ఈ బస్సులు రోడ్లపై తిరుగుతుంటే ప్రజలు విచిత్రంగా ఇప్పటికీ చూస్తున్నారు.

ప్రజల నుంచి స్పందన బాగుంది



ఈ బైక్‌లకు ప్రజల నుంచి మంచి స్పందన ఉంటోంది. పెట్రోల్ వెహికల్స్‌తో పోల్చుకుంటే మెయింటెనెన్స్ చాలా తక్కువగా ఉటుంది. ప్రజల ఆదరణ చూసి ఏథర్ కంపెనీ తరపున జిల్లావ్యాప్తంగా 12 ప్రాంతాల్లో ఫాస్ట్ చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశాము. మా కస్టమర్లు ఉచితంగా ఈ వాహనాలకు చార్జింగ్ చేసుకోవచ్చు.

- జి.దిలీప్‌కుమార్, ఏథర్ నెల్లూరు బ్రాంచ్ మేనేజర్

చార్జింగ్ పాయింట్ 10 కేవీ ఉండాలి



ఈ కార్లకు ఇంట్లో చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేసుకునే సమయంలో కనీసం 10కేవీ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. దీనిద్వారా చార్జింగ్ ఎక్కే సమయంలో బ్యాటరీకి ఎలాంటి ఇబ్బందులు రావు. ఈ కార్లు కొనుగోలు చేసే వారి సంఖ్య ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. ప్రధానంగా డాక్టర్లు, వ్యాపారులు, ఉద్యోగులు కొనుగోలు చేస్తున్నారు.

- ఎస్.విశ్వనాథ్, సేల్స్ జీఎం, బాలాజీ మహేంద్ర

తక్కువ ఖర్చు



ఎలక్ట్రికల్ స్కూటీను ఈ మధ్యే కొన్నాను. గతంలో నేను పెద్ద బైక్ వాడుతున్నప్పుడు రోజు వందల రూపాయలకు పెట్రోలు పట్టించాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు రాత్రి ఈ స్కూటీకి చార్జింగ్ పెట్టి బ్యాటరీ ఫుల్ చేస్తే చాలు రోజంతా తిరగొచ్చు. ఈ స్కూటీ కొన్నప్పటి నుంచి పెట్రోలు ఖర్చు మిగిలింది. డ్రైవింగ్ కూడా చాలా స్మూత్‌గా ఉంది.

- పి సిద్ధార్థ, డాక్టర్, నెల్లూరు

బాట పేరుతో బాదుడు!

- ఇసుక రీచ్‌లో అదనపు వసూలు
- టిప్పర్‌కు రూ.2వేల వరకు దండకాలు
- లబోదిబోమంటున్న వాహన యజమానులు
- ముదివర్తిపాళెం, పల్లెపాడు వద్ద నిరసన

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 20 : జిల్లాలో ఇసుక రీచ్‌ల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో ఇప్పటికే ట్రాక్టర్ ఇసుక దాదాపు రూ.5వేలు పలుకుతోంది. ఇటీవల రీచ్‌లను దక్కించుకొన్న ప్రతిమా సంస్థ నిర్వాహకులు ప్రస్తుత ధరలతోపాటు అదనంగా వసూలు చేస్తున్నారు. కొన్ని రోజుల నుంచి రీచ్‌లకు బాట పేరుతో అదనంగా దండకాలు చేస్తున్నారు. జిల్లాలో ఉన్న 5 ఇసుక రీచ్‌లు 2 డీ సిలిటేషన్ పాయింట్ల నుంచి ట్రాక్టర్‌కు రూ.500 టిప్పర్‌కు రూ.2 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ వసూలుపై వాహనదారులు ఆందోళనకు దిగుతున్నారు. దీనిపై మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ రీచ్‌ల వద్దకు బాట వేసేందుకు ఎలాంటి నగదు వసూలు చేయమని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వలేదని తెలిపారు. ప్రతిమా సంస్థ అధికంగా వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిపై ఇప్పటికే మైనింగ్‌శాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు..

● పల్లెపాడు రీచ్‌లో నిరసన

ఇందుకూరుపేట : టిప్పర్‌కు రూ.2వేలు అదనంగా వసూలు చేయడాన్ని నిరసిస్తూ పల్లిపాడు రీచ్ వద్ద శనివారం సింహపురి టిప్పర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రమంతా రీచ్‌లు ఉంటే పల్లిపాడులో మాత్రం అదనంగా వసూలు చేయడం ఏమి టని ప్రశ్నించారు. ఇంత భారీ మొత్తంలో వసూలు చేస్తే టిప్పర్ల యజమా నులు నష్టపోతారని వాపోయారు. అలాగే ముదివర్తి పాలెం రీచ్ వద్ద కూడా బాట విషయంలో ఇరు వర్గాలు పరస్పరం వాదులాడుకున్నాయి.

ఎమ్మెల్యే ప్రసన్నకు తమ్ముని సెగ

- హల్‌చల్ చేసిన రాజేంద్రరెడ్డి ఆడియో వాయిస్
- రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి సొంత తమ్ముడి సెగ తగిలింది. నల్లపరెడ్డి కుటుంబంలో నెలకొన్న ఇంటి పోరు వీధికెక్కింది. 'ప్రసన్నకుమార్‌రెడ్డికి టికెట్టు ఇవ్వొద్దు.' అంటూ స్వయాన ఆయన తమ్ముడు రాజేంద్రరెడ్డి వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి విన్నవించుకొంటూ సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన ఆడియో రికార్డింగ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా నిలిచింది.

నెల్లూరు, జనవరి 20 (ఆంధ్ర జ్యోతి) : ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ఆయన తమ్ముడు రాజేంద్రరెడ్డిల మధ్య చాలా ఏళ్లుగా సత్సంబంధాలు లేవు. అన్నకు వ్యతిరేకంగా రాజేంద్రరెడ్డి ఇదివరకే పలు సందర్భాల్లో ఎదురు తిరిగారు. ఈ క్రమంలో ఆయన తాజాగా ఒక ఆడియో విడుదల చేశారు. ఆ ప్రసంగంలో తన అన్న ప్రసన్న కుమార్ రెడ్డిని కోవూరు ప్రజలు ఎమ్మెల్యేగా వద్దనుకొంటున్నారని, వైసీపీ అభ్యర్థిని మార్పు చేయాలని జగన్‌మోహన్‌రెడ్డిని కోరుతున్నట్లు ఆడియోలో మాట్లాడారు. ప్రసన్న కుమార్‌రెడ్డి కోవూరు నియోజక వర్గంలోని ఒక్కో మండలాన్ని ఒక్కో నాయకునికి పంచేశారని, వారు ఆ మండలంలో ఎమ్మెల్యేలుగా చెలరేగిపోతున్నారని, ప్రజలను వేదిస్తున్నారని అన్నారు. తమ బాధలు చెప్పుకోవడానికి వెళ్లిన ప్రజలను ప్రసన్న కుమార్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, మళ్లీ గెలుస్తాననే అహంతో ఎవరినీ లెక్క చేయడం లేదని అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రసన్నకుమార్‌రెడ్డిని ప్రజలు వద్దనుకొంటున్నారని, కాబట్టి కోవూరు టికెట్టు ప్రసన్నకు ఇవ్వొద్దని జగన్‌ను కోరుతున్నట్లు రాజేంద్రరెడ్డి ఆడియో ద్వారా వివరించారు.



● వీధికెక్కిన కుటుంబ కలహాలు

ఎమ్మెల్యే ప్రసన్నకు ఆయన తమ్ముడు రాజేంద్రరెడ్డికి మధ్య విభేదాలు ఉన్న విషయం ప్రజలకు తెలిసిందే. అయితే ఏకంగా అన్నకు టికెట్టు ఇవ్వొద్దంటూ తమ్ముడు సామాజిక మాధ్యమాల ద్వారా జగన్‌ను కోరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల సమయాల్లో కూడా రాజేంద్రరెడ్డి తన అన్న ప్రసన్నకుమార్‌రెడ్డికి వ్యతిరేక పార్టీల్లో చేరి పని చేయడం, పోటీ చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ ఎన్నికల సందర్భంగా ప్రసన్నను డైరెక్ట్‌గా టార్గెట్ చేసి తన అన్నకు టికెట్టే ఇవ్వొద్దంటూ జగన్‌ను కోరడం, ఎమ్మెల్యే ప్రసన్నకు అహం పెరిగిపోతోందని ఘాటు వ్యాఖ్యలు చేయడం విశేషం. మొత్తానికి జిల్లాలో పేరుమోసిన రాజకీయ కుటుంబంగా గుర్తింపు పొందిన నల్లపరెడ్డి కుటుంబం అన్నదమ్ముల అంతర్గత కలహాలతో వీధికెక్కడం గమనార్హం.

ఖాకీల కాఠిన్యం!

- అంగన్‌వాడీల ప్రదర్శనలో ఉద్రిక్తత
- రాస్తారోకోను అడ్డుకున్న పోలీసులు, తోపులాట
- రోడ్డుపై ఈడ్చేసిన పోలీసులు
- నాయకులు, అంగన్‌వాడీలకు గాయాలు



కార్మిక సంఘ నాయకులను అరెస్ట్ చేసే సమయంలో అంగన్వాడీలను తోసేస్తున్న మగ పోలీసులు

మహిళలు (అంగన్వాడీలు) అన్న లెక్కలేదు.. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నారన్న సానుభూతి అంతకన్నా లేదు. పాలక పెద్దలు చెప్పారనో... అధికారుల ఆదేశాలనో నెల్లూరులో ఖాకీలు కర్కశంగా వ్యవహరించారు. శాంతియుతంగా ప్రదర్శన చేసి, రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలపై కఠినంగా వ్యవహించారు. వీరికి మద్దతుగా నిలిచిన కార్మిక సంఘాల నాయకులను అరెస్ట్ చేశారు. అడ్డొచ్చిన అంగన్వాడీలను మగ పోలీసులు రోడ్డుపై ఈడ్చి పడేశారు. దీంతో కొందరికి గాయాలు అయ్యాయి.

- వివరాలు 7లో..

రేపు డయల్ యువర్ ఆర్ఎం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జిల్లా పరిధిలోని బస్సు సర్వీసుల గురించి సూచనలు, సలహాలు తెలియజేసేం దుకు సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎం వీవీ.శేషయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 0861-2325196 నెంబరుకు ప్రయాణికులు ఫోన్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మెమూ రైళ్ల రద్దు పొడిగింపు

బిట్రగుంట, జనవరి 20 : బిట్రగుంట నుంచి విజయవాడ, చెన్నై మధ్య నడుస్తున్న మెమూ రైళ్ల రద్దును పొడిగిస్తూ విజయవాడ రైల్వే డివిజనల్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు రద్దు చేసిన బిట్రగుంట - విజయవాడ మెమూను ఫిబ్రవరి 25 వరకు పొడిగించినట్లు తెలిపారు. ప్రతి రోజు బిట్రగుంట-విజయవాడ (07977), విజయవాడ- బిట్రగుంట (07978) మెమూ రైలు తాత్కాలికంగా రద్దు చేశారు. సోమ, మంగళ, బుధ, గురు, శుక్రవాల్లో నడిచే బిట్రగుంట- చెన్నై (17237) చెన్నై- బిట్రగుంట (17238) మెమూ రైలును కూడా ఫిబ్రవరి 23వ తేదీ వరకు రద్దు చేశారు. విజయవాడ డివిజనల్ పరిధిలో పలు స్టేషన్ల మధ్య మూడో లైను పనులు జరుగుతున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఏం జరుగుతుంది!?

- జిల్లాకు చేరిన దొంగ ఎపిక్ కార్డుల కలకలం
- తిరుపతి నుంచి నెల్లూరుకు విచారణ బదిలీ
- అప్పటి చిత్తూరు కలెక్టర్ నేడు నెల్లూరు కలెక్టర్
- హరినారాయణన్‌పై చర్యలు తీసుకుంటారంటూ ప్రచారం
- జిల్లా రాజకీయ, ఉద్యోగ వర్గాల్లో కలకలం



నెల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో జరిగిన దొంగ ఓటరు ఎపిక్ కార్డుల వ్యవహారం ఇప్పుడు జిల్లాకు చేరింది. ఈ కేసులు తిరుపతి నుంచి నెల్లూరుకు బదిలీ కావడం ఒక విషయమైతే అప్పటి చిత్తూరు కలెక్టర్, ఆ జిల్లా ఎన్నికల అధికారి ఎం.హరినారాయణన్ ప్రస్తుతం నెల్లూరు కలెక్టర్‌గా ఉండటం మరో విశేషం. దీంతో దొంగ ఓటరు కార్డుల వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మూడేళ్ల క్రితం తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సమయంలో తిరుపతి, శ్రీకాళహస్తి నియోజక వర్గాల్లో భారీగా దొంగ ఓటరు కార్డులు తయారయ్యాయి. అప్పటి తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ గిరీషా లాగిన్ ఐడీతో వేల సంఖ్యలో ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ చేసి వాటి ద్వారా దొంగ ఓటరు కార్డులను తయారు చేశారు. ఈ కార్డులతో పలువురు ఎన్నికల సమయంలో ఓట్లు వేస్తుండగా టీడీపీ, బీజేపీ వంటి ప్రతిపక్ష పార్టీలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి. దీనిపై అప్పట్లోనే కలెక్టర్, ఎస్పీ వంటి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం అప్పట్లో జరిగిన అక్రమాలపై దృష్టి సారించింది. అప్పటి తిరుపతి కమిషనర్, ప్రస్తుత అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాను సస్పెండ్ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇది జరిగి 24 గంటలు గడవక ముందే తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీఐలపై వేటు పడింది. అదే సమయంలో అప్పట్లో ఈ అక్రమాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అధికారులపై కూడా దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే అప్పటి చిత్తూరు కలెక్టర్ అయిన ఎం.హరినారాయ ణన్‌పై చర్యలకు ఎన్నికల సంఘం సిద్ధమైనట్లు ప్రభుత్వ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో జిల్లాలో ఒక్కసారిగా కలకలం రేగింది. ప్రస్తుతం అధికార, ఉద్యోగ వర్గాలన్నీ ఎన్నికల విధుల్లో ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగు తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. మరోవైపు తిరుపతి ఉప ఎన్నికల్లో నమో దైన కేసులను నెల్లూరు సైబర్ క్రైమ్‌కు బదిలీ చేసి, విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించారు. అందులో నలుగురు డీఎస్పీలను నియమించగా వీరిలో నెల్లూరు నగర, కావలి డీఎస్పీలు ఉన్నారు. తిరుపతిలో జరిగిన అక్రమాల వ్యవహారం ఇప్పుడు మొత్తంగా నెల్లూరు జిల్లాకు చేరుకోవడంతో అన్ని వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

● తెరపైకి ఎమ్మెల్సీ ఎన్నికలు

తిరుపతి వ్యవహారం నేపథ్యంలో గత ఏడాది ప్రారంభంలో జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తెరపైకి వచ్చాయి. అప్పట్లో అనర్హులను ఓటర్లుగా చేర్చినట్లు ప్రతిపక్షాలు ఆరోపణలు చేశాయి. పదోతరగతి చదివిన వారికి పట్టభద్రుల ఓటు కల్పించడం, ప్రైవేట్ స్కూళ్లలో అటెం డర్లకూ ఉపాధ్యాయ ఓటు కల్పించడం వంటి అనేక వ్యవహారాలు వెలుగు చూశాయి. ఈ దొంగ ఓట్ల నమోదుకు సహకరించకపోవడంతోనే నాడు జిల్లా విద్యాశాఖాధికారిని బదిలీ చేసినట్లు కూడా ప్రచారం జోరుగా జరిగింది. ఇన్ని ఆరోపణలు వెల్లువెత్తినా ఎలాంటి విచారణ జరగలేదు. దీంతో ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై కూడా విచారణ జరపాలంటూ పలువురు ఎన్నికల సంఘాన్ని కోరుతుండటం సంచలనంగా మారింది.

ఎన్నికలకు సర్వసన్నద్ధం కావాలి

● జిల్లా కలెక్టరు ఎం. హరినారాయణన్

కందుకూరు, జనవరి 20 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధం కావాలని కలెక్టరు ఎం.హరినారాయణన్ సూచించారు. కందుకూరు నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూం, ఈవీఎంల ర్యాండమైజేషన్, పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు పంపిణీ కోసం స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భవనాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా కళాశాలలో గదులు ఉన్నందున వాటిని వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేసిన పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలలో ఈ నెల 31లోపు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని నియోజకవర్గాలలో ఈ నెల 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేయాలన్నారు. అలాగే 25న జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా జరపాలని, ప్రతిఒక్కరూ విధిగా ఓటుహక్కు వినియోగించుకునేలా ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించాలన్నారు. ఆయన వెంట కందుకూరు సబ్ కలెక్టరు జి. విద్యాధరి, తహసీల్దారు ఆర్. బ్రహ్మయ్య, మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



టీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూం కోసం గదులను పరిశీలిస్తున్న కలెక్టరు హరినారాయణన్

రైతులను మోసగించిన వారిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జనవరి 20: రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి నగదు ఇవ్వకుండా మోసగించిన వారిపై బాలాజీనగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. బాలాజీనగర్ ఆంధ్రాబ్యాంకు వీధిలో నివాసం ఉంటున్న ఎం.శ్రీరాములుకు కర్నాటక రాష్ట్రం బళ్లారి సిరిగుప్పకు చెందిన ధాన్యం వ్యాపారులు రమేష్, మంజు, హను మాన్‌గౌడ్, రంగనాథ్‌గౌడ్‌లతో పరిచయం ఉంది. వారు శ్రీరాములు సహకారంతో నెల్లూరు పరిసర ప్రాంతాల్లోని రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఐదేళ్ల క్రితం రూ.1.20 కోట్ల విలువ చేసే 20 లారీల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అందుకు రైతులకు శ్రీరాములు ష్యూరిటీగా ఉన్నారు. నెలలు గడుస్తున్నా వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యం నగదు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. నగదు చెల్లించా లని శ్రీరాములు వారిని నిలదీసినా ప్రయోజనం లేకపోవడంతో వ్యాపారులు చేసిన మోసంపై శనివారం శ్రీరాములు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎల్.వీరానాయక్ నిందితులపై కేసు నమోదు చేశారు.

నిర్ధారణ కమిటీ రావాల్సిందే..!

● పొలాల నుంచి వెళ్లిపోయిన శాస్త్రవేత్తలు, అధికారులు

మనుబోలు, జనవరి 20 : 'ఇదేమీ అంత కావడం లేదు. ఏం జరిగిందో నిర్ధారణ కమిటీ, జిల్లా శాస్త్రవేత్తలు తేల్చాల్సిందే' నంటూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు చెప్పి వెళ్లిపోవడంతో వెల్లిపల్లి రైతులు తెల్లబోయారు. వెల్లిపల్లిలో నకిలీ విత్తనాలతో దెబ్బతిన్న పొలాలపై



వెల్లిపల్లిలో పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

నకిలీ విత్తనాలు ఒక్కసారి నట్టేట ముంచారన్న వార్తను శనివారం ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీనిపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు స్పందించారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్, కిరణ్‌లతో పాటు డీడీఏ శివన్నారాయణ, ఏడీఏ శివనాయక్, ఏఓ జరీనాబేగంలు వెల్లిపల్లిలో నష్టపోయిన పొలాలను పరిశీలించారు. ఇంత మంది వచ్చి కూడా నకిలీ విత్తనాల వల్ల తక్కువ రోజులకే పంట వెన్నుపోసిందా లేదా వాతావరణ పరిస్థితుల వలనా అన్నది రైతులకు చెప్పకుండానే వెళ్లిపోయారు. త్వరలోనే జిల్లా శాస్త్రవేత్తలు, నిర్ధారణ కమిటీలకు తెలిపి న్యాయం చేస్తామని సెలవి ఇచ్చివెళ్లారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

నెల్లూరు(క్రైం), జనవరి 20: ఇంటి ముందు నిల్చొని ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు తెంపుకెళ్లిన ఘటనపై నవాబుపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. నాగేంద్రనగర్‌లో నివాసం ఉంటున్న రామచంద్ర, అంజలిదేవి దంపతులు కాశర్లవారిలిదీలో కుడువ వ్యాపారం చేస్తున్నారు. వారికి ఇద్ద కుమారులున్నారు. ఈ నెల 19వ తేదీ రాత్రి కుమారుడు ఎదురింట్లో ఆడుకునేందుకు వెళ్లగా కుమారుణ్ని తీసుకువచ్చేందుకు అంజలిదేవి ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. మొహానికి మాస్కు ధరించిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని నాలుగుసవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం సంఘటన జరిగిన ప్రాంతాన్ని, పరిసర ప్రాంతాల్లోని సీసీపుటేజీలను పరిశీలించారు.

విధుల నుంచి వర్క్‌ఇన్‌స్పెక్టర్ తొలగింపు

ఉదయగిరి రూరల్: ఉదయగిరి గృహ నిర్మాణ శాఖలో ఔట్‌సోర్సింగ్ విధానంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.హరినారాయణను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతనెల 29న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామా రావు టీడీపీ నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్ర మంలో భాగంగా పట్టణంలోని శ్రీనగర్‌కాల నీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో వర్క్ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి తాను నిర్మిస్తున్న ఇంటికి ప్రభుత్వ సిమెంట్‌ను వాడ కున్నాని గుర్తించారు. ఈ విషయాన్ని కలెక్టర్‌తో పాటు గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో భాగంగా ఈ నెల 4న విజయవాడ విజిలెన్స్ అధికారులు ఉద యగిరికి చేరుకుని కార్యాలయంలోని రికార్డులతో పాటు సిమెం ట్ గోదామును పరిశీలించారు. అనంతరం హౌసింగ్ అధికారులు ఇచ్చిన నివేదిక మేరకు కలెక్టర్ వర్క్‌ఇన్‌స్పెక్టర్‌ను విధుల నుంచి తొలగించడంతో పాటు కేసు నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

బట్టలు విప్పి కేకలు వేసిన ఏడుగురిపై కేసు నమోదు

● నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ● ముగ్గురి పరార్

కావలి రూరల్, జనవరి 20: కావలి పట్టణంలో అధికార పార్టీ నేతల అనుచరులుగా చలామణి అవుతూ అర్ధరాత్రి నడివీధిలో బట్టలు విప్పి, కేకలు వేస్తూ సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించిన ఏడుగురు యువకులపై శనివారం 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని కామాటివారి వీధిలో ఈనెల 17వ తేదీ అర్ధరాత్రి సమయంలో కొందరు యువకులు రోడ్డుపై నగ్నంగా తిరుగుతూ ఈలలు, కేకలు వేస్తూ వికృత చేష్టలు చేశారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి దినపత్రికలో బట్టలు విప్పి .. కేకలు వేసి అనే శీర్షికతో శనివారం వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పోలీసులు ఆధారంగా సీసీ పుటేజ్ ఆధారంగా స్థానికుల ఫిర్యాదుతో ఏడుగురిపై కేసునమోదు చేశారు. బట్టలు విప్పి తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేసిన వాకా ఈశ్వర్‌రెడ్డితో పాటు ప్రకాషావేటి పోలయ్య, కసాని పవన్, కడియంపాటి నరసయ్యలను అదుపులోకి తీసుకోగా కౌషిక్, కార్తీక్, మల్లికార్జునలు పరారీలో ఉన్నారు.

చెట్టును ఢీకొన్న కారు: ఒకరి మృతి

కావలి రూరల్, జనవరి 20: కారు బోల్తాపడి ఒకరు మృతిచెందిన సంఘటన కావలి మండలం సర్వాయపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన పేట శ్రీనివాస్ (39)కు బెంగళూరులోని బొమ్మనహళ్లి ప్రాంతానికి చెందిన



మృతి చెందిన శ్రీనివాస్

ఆయేషాకు 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న వారు 6 నెలల క్రితం స్వగ్రామానికి వచ్చారు. ఈనేపథ్యంలో ఈనెల 18న నందనవనంలో ఉన్న భార్యను కారులో ఆత్మకూరు ఉరిలో బెంగళూరు తీసుకువెళ్లి వదిలిపెట్టి శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో శ్రీనివాస్ కారులో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలోని కావలి మండలం ముసునూరు టోల్‌గేట్ వద్ద కారు రోడ్డుపక్కన ఆపి నిద్రపోతుండగా శ్రీనివాస్ బావ మరిది గొడుగు సాయిసతీష్ ఫోన్ చెయ్యగా గంటలో ఊరికి వస్తానని చెప్పి తిరిగి కారులో బయలుదేరాడు. బయలుదేరిన 10 నిమిషాల్లోనే కారు టైరు పగిలి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఫెన్సింగ్ రాళ్లను ఢీకొని బోల్తాపడి చెట్టును ఢీకొంది. దీంతో కారులో నుంచి కింద పడిపోయిన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య ఆయేషా, 3 నెలల కుమార్తె ఉన్నారు. రూరల్ ఎస్ఐ సుమన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళపై దాడి

బంగారు ఆభరణాలతో పరార్

నెల్లూరు(క్రైం), జనవరి 20: ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన నగరంలోని పేస్ ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. ఉమ్మారెడ్డిగుంటకు చెందిన కమలమ్మ, రాములు దంపతులు. వారి కుమార్తె స్వాతికు వివాహమై నగరంలోనే నివాసం ఉంటుంది. రాములు కొంతకాలం కిందట మరణించడంతో కమలమ్మ ఒంటరిగా జీవిస్తోంది. రెండు నెలల కిందట ఆమె వద్దకు ఓ గడపి శ్రీకాకుళంకు చెందిన నరేంద్ర అనే యువకుడికి ఆశ్రయం ఇచ్చింది. అతను అప్పుడప్పుడు వృద్ధురాలికి తోడుగా ఆమె ఇంట్లోనే పడు కునేవాడు. సంక్రాంతి పండుగకు నరేంద్ర తల్లిదండ్రులు ప్రకా నోం కుటుంబ సభ్యుల

చికెన్ ధరలు	
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	కిలో
బాయిలర్ లైవ్	113
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230
లేయర్	145

బంగారం, వెండి ధరలు	
బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 5953
వెండి కిలో ధర	రూ. 73,000
వెండి ఒక గ్రాము	రూ. 75.00

శ్రాడు కొల్లా అతను వెళ్లడంతో అతను ఒంటరిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నరేంద్ర కాల్ ద్వంటలో మత్తుమందు కలిపి వృద్ధురాలికి ఇచ్చాడు. అది తాగిన కొద్దిసేపటికి ఆమె నిద్రమత్తులోకి జారు కుంది. ఆ తరువాత బయటకు వెళ్లి తిరిగి వచ్చిన అతను వీరితో ఆమె మెడను ఉప్పుబిగించి, ఆమె చేతిలో ఉన్న కర్రతో ఆమె తలపై బలంగా దాడి చేసి చంపుతానని బెదిరించాడు. ఆమె ఒంటిపైనున్న 9 సవర్ల బంగారు గాజులు, గొలుసు, ఉంగరం తీసుకుని ఉడాయించాడు. వృద్ధురాలు కేకలు వేయడంతో నిందితుడు అక్కడ నుంచి పరారయ్యాడు. ఆమె తన కుమార్తెకు విషయం తెలపడంతో ఆమె హుటాహుటిన తల్లి వద్దకు చేరుకొని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తీసుకెళ్లింది. చికిత్స అనంతరం శనివారం బాధితురాలు ఈ ఘటనపై వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కులగణనకు సర్వర్ కష్టాలు!

నెల్లూరు(హరనాథపురం), జనవరి 20: కులాల వారీగా జనాభా, వారి ప్రస్తుత, సామాజిక, విద్య, ఆర్థిక పరిస్థితులను తెలుసుకోవడానికి చేపట్టిన కులగణన సర్వేకు సర్వర్ కష్టాలు వెంటాడుతున్నాయి. దీంతో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పలుగ ణనను సకాలంలో చేయించలేక నానా అవస్థలు పడుతున్నారు. ఒక్కో వలంటీర్ పరిధిలో 50 నుంచి 70 గృహాలు ఉన్నాయి. రోజుకు 10 నుంచి 15 గృహాలు సర్వే పూర్తి చేయించాలని నిర్ణయించారు. అయితే సర్వర్ కష్టాల వలన రోజుకు 4 నుంచి 5 గృహాల్లో సర్వే పూర్తి చేయలేకపోతున్నట్లు సమాచారం. వలం వాయిదాల తరువాత ఈనెల 19న ఆరంభమైన ఈ కార్యక్రమం ఈనెల 28 వరకు చేపట్టనున్నారు. తొలిరోజు బాలారిష్టాలు అనుకొంటే, రెండో రోజూ సర్వర్ మొరాయించడంతో ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. కులగణన సర్వేలో ఎలాంటి కుల్రుధ్రీకరణ పత్రాలు, రిరునామా కార్డు వంటివి చూపించాల్సిన అవసరం లేదు. సర్వే పూర్తి చేయడానికి 8 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు మినహా కుటుంబ సభ్యులందరికీ ఈకేవైసీ తప్పనిసరిగా ఉంటుంది. ఎవరైనా కుటుంబ సభ్యుడు మరణించినట్లు



తోటపల్లిగూడూరు మండలం వరిగొండలో సర్వే చేస్తున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది

గుర్తిస్తే కుటుంబసభ్యులలో ఒకరికి ఈకేవైసీ తప్పనిసరిగా తీసుకుంటారు. ఒకే సభ్యుడు లేదా మొత్తం కుటుంబం చనిపోతే, వివరాలు సమర్పించడం కోసం సచివాలయ ఉద్యోగి ఈకేవైసీ తప్పనిసరిగా చేస్తారు. కేవలం ఒక ఇంటికి వెళ్లినప్పుడు ఆ ఇంట్లోని వారు చెప్పే సమాచారాన్ని మాత్రమే వలంటీర్లు నమోదు చేసుకోవాలి. సర్వే చేసేట ప్పుడు ఏదైనా కుటుంబంలోని సభ్యులు అందు బాటులో లేకపోయినే వారి కోసం ఒక ప్రత్యేక అవకాశాన్ని కల్పించారు. ఈ నెల 28 తరువాత మరో ఐదు రోజులపాటు వారు సచివాలయానికి వచ్చి వివరాలు నమోదించుకోవచ్చు. ఈ అవకాశం ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఉంటుంది. ప్రతి ఇంటి సర్వే ముగింపులో వలంటీర్, సచివాలయ ఉద్యోగి ఈకేవైసీ తప్పని సరిగా వేయాలి. ఇక్కడే ఈకేవైసీ, సర్వర్ సమస్య తలెత్తుతోంది. దీనికి తోడు సర్వేలో పలు ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి రావడం, సంక్షేమ పథకాలకు ఇబ్బందులు కలుగుతాయేమోనని కొందరు సర్వేకు సహకరించడం లేదని సమాచారం. ఈ కార్యక్రమం మొదలై రెండు రోజులైనా ఇంకా బాలారిష్టాల్లోనే ఉండటంతో ఈ సర్వే సవ్యంగా సాగుతుందా అనే అనుమానం వ్యక్తమవుతోంది.

ప్రమాదంతో కుటుంబం ఛిన్నాభిన్నం



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ, ఇతర అధికారులు

● ఫిబ్రవరి 19 వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలు
● జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 20: ప్రమాదంలో ఓ వ్యక్తి మరణిస్తే ఆతని కుటుంబం ఛిన్నాభిన్నం అవుతుందని, ఈ విషయాన్ని గ్రహించి వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని జాయింట్ కలెక్టర్ ఆర్ కూర్మనాథ్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో శనివారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై కేసులు నమోదు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హెల్మెట్ వినియోగం తప్పనిసరి చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాతీయ భద్రత అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో అలక్ష్యం వహించవద్దని సూచించారు. ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం, నేషనల్ హైవే అథారిటీ వారు రోడ్డు భద్రతా వారోత్సవాలను మాసోత్సవాలుగా మార్చారన్నారు. జనవరి 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19 వరకు నెలరోజుల పాటు ప్రజల్లో, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం మాసోత్సవాల కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ బీచందర్, ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీ అబ్దుల్ సుభాన్, ప్లానింగ్ అధికారి దేవకుమార్, ఇన్‌చార్జి ఆర్డీవో మురళి, ఆర్టీసీ ఆర్ఎం శేషయ్య, డీఎంవో సురేష్‌బాబు, ఎన్‌హెచ్ ఏవీ అధికారి సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత 'సూరా' అరెస్ట్!

● సమయం దాటినా బార్ నిర్వహిస్తున్నారని పోలీసుల దాడులు
● అయితే, తెర వెనుక మరొకటి ఉందంటున్న అనుచరులు
● బుచ్చి స్టేషన్ ముందు ఆందోళన, ఉద్రిక్తత

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 20 : వైసీపీ రాష్ట్ర విభాగం నేత, వచ్చేరు బ్యాంకు మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డిని శనివా రం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. నెల్లూరులోని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద ఉన్న ఆయన్ను సీఐ హైమారావు తన సిబ్బందితో వెళ్లి అరెస్టు చేసి బుచ్చికి తీసు కొచ్చారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షలు అనంతరం తిరిగి స్టేషన్‌కు తీసుకెళ్లారు. బుచ్చిలోని టీఎస్ఆర్ వంతెన హోటల్ సమీపంలో సూరాకు చెందిన రాయల్ బార్ నిర్ణీత సమ యం దాటినా నిర్వహించి ఉంచారంటూ శుక్రవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో పోలీసులు దాడులు నిర్వహించారు. బార్‌లో సిబ్బంది, తిరుపాల్‌ను అదుపులోకి తీసు కున్న పోలీసులు బుచ్చిలోని తమ ఇంట్లో ఉన్న ఆశోక్ రెడ్డి, శ్రీనులను అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు.



ప్రభుత్వాసుపత్రిలో సూరాకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

● బెల్టుషాపు నిర్వహిస్తున్నాడనీ..

శుక్రవారం రాత్రి జరిగిన దాడుల్లో బార్ వెనుక 201 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హైమారావు తెలిపారు. బార్ సిబ్బంది సమాచారంతో మినరల్యుల్లో ఓ బెల్టు దుకాణంపై దాడులు చేశామని, నిర్వాహకుడు శ్రీనివాసులురెడ్డి అని తేలడంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నలుగురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు.

● పథకం ప్రకారమే అరెస్ట్?

సూరా శ్రీనివాసులురెడ్డి టీడీపీలో చేరా దుకు ప్రయత్నిస్తున్నాడనే పుకార్లతోనే ఆయన్ను అరెస్ట్ చేసినట్లు ఆయన అనుచ రులు తెలిపారు. ఎప్పటి నుంచో నడుస్తున్న బార్ నిర్వహణను పట్టించుకోని పోలీసులు ఉన్నట్టుండి దాడులు చేయడం ఏమిటని నిలదీశారు.

● ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా నినాదాలు

సూరా అరెస్టుతో వైసీపీ నాయకులు, అనుచ రులు పంచేడు గ్రామానులుల సమ యం స్టేషన్ వద్దకు చేరుకున్నారు. శ్రీనివాసులురెడ్డిని చూడాలంటూ స్టేషన్‌ను ముట్టడించారు. ఎస్ఐ మహేంద్ర వారించినా, సూరాను చూపి స్టామని సీఐ చెప్పినా వారు వినలేదు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఓ దశలో సీఐ వారిని చెదరగొట్టే ప్రయ త్నం చేసినా ఫలించలేదు. సూరాతోపాటు బార్‌సిబ్బందిని కోర్టుకు హాజరుపరచేందుకు పోలీసు జీపులో తరలిస్తుండగా అడ్డుకున్నారు. ఓ మహిళనుద్దేశించి సీఐ మాట్లాడిన తీరుపై మండిపడి స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. చివరకు పోలీసులు సర్ది చెప్పడంతో అంతా శాంతించారు.



బుచ్చి పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన అనుచరులు

ఖాకీల కాఠిన్యం!

● అంగన్‌వాడీల ప్రదర్శనలో ఉద్రిక్తత
● రాస్తారోకోను అడ్డుకున్న పోలీసులు, తోపులాట
● రోడ్డుపై ఈడ్చేసిన పోలీసులు
● నాయకులు, అంగన్‌వాడీలకు గాయాలు

నెల్లూరు (వైద్యం), జనవరి 20 : నెల్లూరులో శనివారం అంగన్‌వాడీల నిరసన ప్రదర్శన ఉద్రిక్తతకు దారి తీసింది. నగరంలోని వీఆర్సీ కూడలిలో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేయడానికి ప్రయత్నించడంతో తోపులాట జరిగింది. దీంతో పలువురు గాయపడటంతో ఆసుపత్రికి తరలించారు. డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శనివారానికి 40వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంగన్వాడీలు గాంధీబొమ్మ నుంచి వీఆర్సీ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అక్కడ రాస్తారోకో నిర్వహించగా పోలీసులు అడ్డుకుని, అంగన్‌వాడీలను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించారు. వీరిని అంగన్వాడీలు అడ్డుకోవడంతో తీవ్ర వాగ్వివాదం జరిగింది. మహిళలు అని చూడకుండా మగ పోలీసులు లాగి పడేసి కార్మిక సంఘాల నాయకులను పోలీసు వ్యానులోకి ఎక్కించారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. దీంతో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అజయ్‌కుమార్‌లు సొమ్మసిల్లి పడిపోగా నలుగురు అంగన్వాడీలు అస్వస్థతకు గురయ్యారు. వాణి అనే అంగన్‌వాడీ కార్యకర్తకు చేయి వేలు విరిగింది. దీంతో బాధితులను ఆసుపత్రికి తరలించారు. ఈ నిరసనలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు బత్తుల కిష్టయ్య, సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, కొండా ప్రసాద్, కిన్నెర కుమార్, పేట మస్తాన్, అంగన్‌వాడీల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాతమ్మ, రెహనాబేగం తదితరులు పాల్గొన్నారు.



నాయకులను అరెస్ట్ చేసి ఉంచిన పోలీస్ వాహనాన్ని చుట్టుముట్టిన అంగన్వాడీలు



విరిగిన చేతివేలును చూపుతున్న వాణి

● ఇది చాలా దుర్మార్గం

అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులపై పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం దున్నపోతుపై వానపడ్డట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అనంతరం రామచంద్రారెడ్డి వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. అలాగే బీజేపీ నేత మిడతల రమేష్ కూడా బాధితులను పరామర్శించి, పోలీసుల తీరుపై మండిపడ్డారు.

'ఖజానా'కు జిల్లాస్థాయి కమిటీ

నెల్లూరు(హరనాథపురం), జనవరి 20 : ఖజానా స్ట్రాంగ్ రూంలో భద్ర పరచిన స్టాంపులు, స్టేషనరీ, ఆర్టికల్స్ మీద జాయింట్ కలెక్టర్ నాయకత్వంలో జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఈనెల 5న సమావేశమై స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఉపయోగంలో లేని చెక్కులు, స్టాంపులు తదితరాలను నాశనం చేయాలని తీర్మానించారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు ఆ కమిటీ ద్వారా జిల్లా ఖజానా కార్యాలయ దక్షిణం వైపు ఖాళీ స్థలంలో వాటిని నాశనం (డిస్ట్రాయ్) చేయనున్నారు.

గిరిజనులను మోసగించిన వైసీపీని ఓడిస్తాం !

రాపూరు(డక్కిలి), జనవరి 20 : గిరిజనులను మోసం చేసిన వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యంగా గిరిజనుల పెట్టుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసీ పెంచలయ్య పిలుపునిచ్చారు. శనివారం ఆయన సంఘనేతలతో కలిసి సంక్రాంతి పల్లి గిరిజన కాలనీ వాసులతో ముఖాముఖి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి గిరిజన సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ ప్రత్యేక కార్పొరేషన్ ఇస్తామని మోసం చేశారని ఆరోపించారు. గిరిజనులందరూ ఏకమై రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చేవూరు సుబ్బారావు, మాకాని రవీంద్రబాబు, ఉష పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలు

● ఎలిసీ రమణారెడ్డి

నెల్లూరు(విద్య), జనవరి 20 : తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన ఎలిసీ రమణారెడ్డి ఆరోపించారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హతలేని దొంగ ఓటర్లను నమోదు చేశారని, ఈ నకిలీ ఓట్ల నమోదుపై ఎన్నికల కమిషన్ విచారణ జరిపించా లన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కఠిన చర్యలకు దిగడం శుభ పరిణామమన్నారు. ఇదే తరహాలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నకిలీ ఓటర్ల నమోదు జాబితాను పునః పరిశీలన చేయాలన్నారు. ఎన్నికల్లో అధికారపక్షం అధికార దుర్వినియోగానికి పాల్పడి రెండు, మూడో తరగతి చదివిన ప్రైవేట్ స్కూల్ సిబ్బంది, అటెండర్లను సైతం సర్టిఫికెట్ ఉపాధ్యాయులుగా చూపించి వారిని నకిలీ ఓటర్ల జాబితాలో చేర్చడం కోసం అడ్డదారులు తొక్కారని ఆరోపించారు. అధికారులు స్టాంప్‌లను సైతం నకిలీవి సృష్టించి వారి సంతకాలను ఫోర్జరీ చేసి దొంగ ఓట్లను చేర్పించారన్నారు. ఎన్నికల్లో అధికార పక్షం చేసిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిగి అందుకు సహకరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

టాస్క్‌ఫోర్స్ అధికారుల అదుపులో ఎర్రచందనం కూలీలు

కలువాయి : వెంకటరెడ్డిపల్లి కూడలిలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి తమిళనాడుకు చెందిన సుమారు 20 మంది ఎర్రచందనం కూలీలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ అధికారులు అదుపులోని తీసుకున్నట్లు సమాచారం. హైవేపై నెగ్గుూ వెళుతున్న ఈ రెండు వాహనాన్ని అధికారులు వెంబడించి వెంకటరెడ్డిపల్లి సమీపంలో అడ్డగించారు. అందులో ఉన్న కూలీలు తప్పించుకునే ప్రయత్నం చేయగా గ్రామస్థుల సహకారంతో వారిని పట్టుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

సమస్యల పరిష్కారం కోసం కదంతొక్కిన అంగన్వాడీలు



కావలి టౌన్: ట్రంకురోడ్డు బ్రిడ్జి కూడలిలో రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలు



కందుకూరు: నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్వాడీలు

కావలిటౌన్, జనవరి 20: అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం ట్రంకురోడ్డు బ్రిడ్జి కూడలిలో అంగన్వా డీలు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఆర్డీవో కార్యాలయం వద్ద నుంచి భారీ ప్రదర్శన నిర్వహించి బ్రిడ్జి కూడలిలో రాస్తారోకో నిర్వహిం చడంతో ట్రంకు రోడ్డుకిరు వైపులా ఉదయగిరి రోడ్డు, తుమ్మల పెంట రోడ్డులో భారీగా వాహనాలు నిలిచి పోయి ట్రాఫిక్ స్తంభించింది. వన్ టౌన్ సీఐ రాజేష్, టూటౌన్ సీఐ శ్రీనివాసులు పర్యవేక్షణలో పోలీసులు ట్రాఫిక్ పునరుద్ధరించారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకుడు పసుపులేటి పెంచులయ్య, యూనియన్ నేతలు రఘురావమ్మ, విజయలత, సుభాషిణి, వజ్రమ్మ, రమాదేవి, సీపీఎం నేతలు మాల్యాద్రి, వెంకయ్య, అమీర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు శనివారం కందుకూరు ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, రహంతున్నీషా, సరస్వతి, కేశవకుమారి, శంషాద్, అనూరాధ, ఎస్ఏ గౌస్, జీవీబీ కుమార్, డి రామమూర్తి, పవన్‌కుమార్, రైతుసంఘం నాయకులు ముప్పరాజు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: సమస్యల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె రోజురోజుకు ఉధృతంగా మారుతోంది. ఈ క్రమంలో పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్‌లో శనివారం అంగన్‌వాడీలు మానవహారంగా ఏర్పడి రాస్తారోకో నిర్వహించి నిరసనలతో హోరెత్తించారు. వీరికి మద్దతుగా సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆత్మకూరు నాగయ్య, కే. డేవిడ్‌రాజు రాస్తారోకోలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మెతో అంగన్‌వాడీలు మూతపడి చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పీ. రాధ, సెక్టార్ లీడర్లు కే. రమణమ్మ, కామేశ్వరీ, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

జనసైనికుడికి ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న జనసేన నాయకులు

ఉదయగిరి రూరల్, జనవరి 20: మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు గుడిపాటి హరికృష్ణ ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతిచెందారు. దీంతో శనివారం జనసేన పార్టీ నాయకులు వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. నియోజకవర్గ జనసేన నాయకులు భోగినేని కాశీరావు రూ.10వేలు, మండల జనసేన నాయకులు సురేంద్రరెడ్డి, చింతల శ్రీను, గాదె నరేంద్ర రూ.15వేలు చొప్పున రూ.25 వేల నగదును హరికృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సెమళ్లదిన్నె సర్పంచ్ తోకల రామచంద్ర, జనసేన నాయకులు అల్లూరి రవీంద్ర, పోలిశెట్టి శ్రీనివాసులు, పసుపులేటి తిరుపతయ్య, శ్రీను, చంద్రబాబు పాల్గొన్నారు.

ప్రణాళికల తయారీపై దృష్టి సారించాలి

ఉదయగిరి రూరల్, జనవరి 20: పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు పంచా యతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై దృష్టిసారించాలని, ఈనెల 27న గ్రామసభలు నిర్వహించి నివేదిక అందించాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, ఏవో రేణుకా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, జనవరి 20: మున్సిపల్ మాజీ చైర్మన్ దివి లింగయ్యనాయుడు ఇంటి పరిసరాల్లో లైన్‌వర్క్ జరుగుతున్నందున ఆ పరిసర ప్రాంతాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ ఏఈ టీవీ నరసింహం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో ఉన్న తూర్పు వడ్డిపాలెం, తూర్పు కమ్మపాలెం, తూర్పు సాలిపాలెం, రాళ్లవీధి, మారెమ్మమిట్ట, కోటారెడ్డి నగర్, క్లబ్‌రోడ్డు, ఆదిఆంధ్రకాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

22న అంగన్‌వాడీల నియామకానికి ఇంటర్వ్యూలు

ఉదయగిరి, జనవరి 20: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం మండలాల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు సంబంధించి సోమవారం ఇంటర్వ్యూలు జరుగుతాయని సీడీపీవో పచ్చవ లావణ్య శనివారం తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఉదయగిరి, జనవరి 20: నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్ష కేంద్రంలో మొత్తం 240 మంది విద్యార్థులకు గానూ 111 మంది హాజరయ్యారు. 129 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరిం టెండెంట్ బాలకేశవులు తెలి పారు. సెంటర్ లెవల్ అబ్జర్వర్‌గా పీ. సత్య వ్యవహరించారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): స్థానిక ఆదర్శ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో 438 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 289 మంది హాజరయ్యారు. 149 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ నాగలక్ష్మి, అబ్జర్వర్‌గా ప్రీతి వ్యవహరించారు.

మంత్రి కాకాణిని కలిసిన వైసీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, జనవరి 20: రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని శనివారం నెల్లూరులోని ఆయన అతిథిగృహంలో ఉదయగిరి వైసీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉదయగిరి పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ ముర్తుజా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ యస్థానీ, వైస్ మాజీ ఎంపీపీ బాలిబోయిన శ్రీనివాసులు, నాయకులు షేక్ యస్థానీ, అక్కులరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్



డ్రోన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీతారామపురం, జనవరి 20: మండల పరిధిలోని అయ్యవారిపల్లి, పొలంగారిపల్లి గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కేంద్ర ప్రభు త్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ డ్రోన్ ద్వారా పొలాలకు ఎరువులు, పురుగు మందులను ఎలా పిచికారి చేయాలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ఎమ్మార్వో సుధాకర్ రావు, డాక్టర్ స్వప్న, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, ఈసీ సువర్తయ్య, ఏపీఎం సుధాకర్ , ఎంపీటీసీ అల్లూరు రాజు, పంచాయతీ కార్యదర్శులు, బీజేపీ ఉదయగిరి నియోజకవర్గ నాయకుడు రమేష్ పాల్గొన్నారు.


వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

సంగం, జనవరి 20: వేసవిలో నెల్లూరు పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు నెల్లూరు మేయర్ పోట్లూరి స్రవంతి తెలిపారు. అందులో భాగంగా శనివారం ఆమె కార్పొరేటర్లతో కలిసి సంగం బ్యారేజీకి దక్షిణ వైపు నిర్మించి ఉన్న ఇన్‌టెక్ వెల్‌ను పరిశీలించారు. అనంతరం మహమ్మదాపురం వెళ్లి అక్కడ నీటి ఫిల్టరేజేషన్‌ను పరిశీలించారు. ఆమె వెంట పలువురు కార్పొరేటర్లు ఉన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 9,12,817

వలేటివారిపాలెం, జనవరి 20 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి 9,12,817 ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 8,550, కుంకుమార్చన ద్వారా రూ. 28,160, తల నీలాలు ద్వారా రూ. 44,400, వాహన పూజలు ద్వారా రూ. 4,140, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 2,99,300, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 1,480, రూములద్దెలు ద్వారా రూ. 33,460, కవర్లు ద్వారా రూ. 6,300, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,06,755, అన్నదానం ద్వారా రూ. 2,40,040, విరాళముల ద్వారా రూ. 40,232 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాసరావు తెలియజేశారు.

ఒంగోలు పశు జాతి అద్దె గర్భం విజయవంతం



పశు పౌష్టికాహారం అందచేస్తున్న డాక్టర్ సోమయ్య (డీడీ)

బిట్రగుంట, జనవరి 20: ఒంగోలు పశు జాతి అద్దె గర్భం విజయవంతమై కోడెదూడను ప్రసవించడం కావలి నియోజక వర్గంలో మొదటిదని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సోమయ్య అన్నారు. బోగోలు మేజర్ పంచాయతీకి చెందిన గనాధి. మాల్యాద్రి యొక్క ఒంగోలు జాతి ఆవుకు పిండ మార్పిడి ద్వారా ప్రసవించిన ఒంగోలు జాతి కోడెదూడను శనివారం ఆయన సందర్శించారు. ఆవు, దూడకు అవసరమైన పౌష్టికాహార ఓషదాలు, మినరల్ మిక్చర్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు డివిజనల్ పశువైద్యులు వేంకటేశ్వర నాయక్, స్థానిక పశువైద్యులు శ్రావన్‌కుమార్‌లు పాడిపశు యజమాన్ని పిండమార్పిడికి ఒప్పించి విజయం సాధించారని అభినందించారు. ఆ కోడెదూడ ఆరోగ్య పరిస్థితి పరీక్షించి నాయక్ అని నామకరణం ఈ కార్యక్రమంలో రమేష్ నాయక్, ఏఎంఏ శ్రీకాంత్, సిబ్బంది పాడిరైతులు తదితరులు ఉన్నారు.

22న ప్రభుత్వం సెలవు ప్రకటించాలి

కలిగిరి, జనవరి 20: రామ మందిరం నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మనరాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలకు సెలవు ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నందనవనం ప్రభాకరరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

23 నుంచి ఎఫ్ఏ-3 పరీక్షలు

ఉదయగిరి రూరల్, జనవరి 20: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈనెల 23వ తేదీ నుంచి ఎఫ్ఏ-3 పరీక్షలు జరుగుతాయని ఎంఈవో మస్తాన్‌వలి తెలిపారు. శనివారం ఆయన స్థానిక మండల విద్యా వనరుల కార్యాలయంలో సీఆర్ఎంటీలతో సమీక్షించారు.

సోమశిల నుంచి మా వాటా నీరు ఇప్పించండి!

● కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే మహీధరరెడ్డి



కలెక్టరుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి

కందుకూరు, జనవరి 20: సోమశిల జలాశయం నుంచి రాళ్లపాడు రిజర్వాయరుకు రావాల్సిన వాటానీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మహీధరరెడ్డి కలెక్టర్ హరినారాయణన్‌ను కోరారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హరినారాయణన్‌ను ఎమ్మెల్యే కలిసి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, బిల్లులు సకాలంలో విడుదల చేయాలని కోరారు. అలాగే రాళ్లపాడు రిజర్వాయరు ఆయకట్టులో పంటలను కాపాడేందుకు ఆరుతడి పంటలకు నీరివ్వాలని రైతులు చేస్తున్న విజ్ఞప్తిని పరిశీలించాలని కోరారు. రానున్న వేసవిలో మంచినీటిపథకాలకు నీటి ఎద్దడి రాకుండా రిజర్వాయరులో తగినంత నీటిని నిల్వ చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టరు జి.విద్యాధరి తదితరులు పాల్గొన్నారు.

● రాళ్లపాడు రిజర్వాయరులో ప్రస్తుతం ఉన్న నీటిని ఆరుతడి పంటలకు ఇవ్వాలని వరికూటి కృష్ణారెడ్డి తదితర రైతులు కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. రాళ్లపాడు, సాయిపేట తదితర గ్రామాల పరిధిలో పంటలు ఎండిపోతున్నందున రిజర్వాయరులోని నీటిని కుడికాలువకు వదిలితే ఆరుతడులు వేసుకుంటామని వారు విజ్ఞప్తిచేశారు. రిజర్వాయరులో నీటి నిల్వ, భవిష్యత్తు అవసరాలపై చర్చించి అవకాశం ఉంటే తగుచర్యలు తీసుకుంటామన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామదూత స్వామి చారిటబుల్ ట్రస్ట్ బాధ్యులు

కావలి, జనవరి 20: శ్రీరామదూత స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు శనివారం ఆ ట్రస్ట్ బాధ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. కావలి పట్టణం ముసునూరు వినాయకనగర్, ఎస్సీ కాలనీలలో కావలి రూరల్ మండలం కొత్తపల్లి ఎస్సీ, బీసీ కాలనీలలో రామదూత స్వామి చేవూరు ఆశ్రమం వారు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు బెల్లంకొండ హనుమంతరావు, ఎంవీ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

23న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కందుకూరు, జనవరి 20: నూతన సంవత్సరంలో మొదటి పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 23న సాయంత్రం 8 గంటలకు కందుకూరు నుంచి అరుణా చలంకు ప్రత్యేకబస్సు ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజరు పెద్దన్నశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో తిరుత్తిని, తిరువల్లూరు, విష్ణుకంచి, శివకంచి, కంచి కామాక్షి, గోల్డెన్‌టెంపుల్ దర్శనంతో పాటు అరుణాచలం గిరిప్రదక్షిణ ఉంటుందని ఆయన తెలిపారు. ప్రయాణికులకు భోజన సౌకర్యంతో కలిపి టిక్కెట్ రూ.2600గా నిర్ణయించామని, ఆసక్తి కలిగిన వారు సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకోసం 9959225698 నెంబరును సంప్రదించాలని కోరారు.

కోడి పందేల స్థావరంపై దాడి

కొండాపురం, జనవరి 20: కోడిపందాల స్థావరంపై ఎస్ఐ ఖాజావలి తమ సిబ్బందితో శనివారం దాడి నిర్వహించారు. సత్యవోలు, దూబగుంట అటవీప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి ఐదుగురు పందెం రాయుళ్ళను అదుపులోకి తీసుకొని, వారివద్దనుండి రూ.2400నగదు, మూడు కోళ్ళు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

మెప్మా ఆధ్వర్యంలో హ్యాండ్‌వాష్ సెంటర్ ఏర్పాటు

కందుకూరు, జనవరి 20: కందుకూరు మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో శనివారం హ్యాండ్‌వాష్ సెంటర్‌ను మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరికీ చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం ఇంగర్సల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


పందులను గ్రామాల్లోకి వదలొద్దు



పందుల పెంపకందారులను నిలదీస్తున్న స్థానికులు

బిట్రగుంట, జనవరి 20: స్వలాభం చూసుకుంటూ గ్రామాల్లో పందులను వదిలేస్తున్నారే తప్ప ప్రాణాపాయంగా ఉందంటే పట్టించుకోరా అని గ్రామస్థులు పందుల పెంపకందారులను నిలదీశారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో శనివారం కొందరు పందులను పట్టుకునే వారు సంచరిస్తుండటం స్థానికులు గుర్తించారు. విచ్చలవిడిగా పందులను గ్రామంలో విడిచి పెట్టడం వలన ఇళ్లలోకి చొరబడుతున్నాయని, అడ్డగిస్తే దాడి చేస్తున్నాయన్నారు. గ్రామాల్లో పందులను వదలడం మంచిది కాదని ఉన్న వాటిని వెంటనే పట్టుకు పోవాలని హెచ్చరించారు. పంచాయతీ అధికారులు కూడా పందుల పెంపకందారులపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి విజేత ముత్యాలపాడు జట్టు



మండల స్థాయిలో విజేతగా నిలిచిన ముత్యాలపాడు వాలీబాల్ జట్టు

లింగసముద్రం, జనవరి 20 : ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో మండల స్థాయిలో వాలీబాల్ పోటీల్లో ముత్యాలపాడు వాలీబాల్ జట్టు విజేతగా నిలిచింది. శనివారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్ ఆవరణలో ముత్యాలపాడు, పెదపవని-1 జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముత్యాలపాడు వాలీబాల్ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ యు శేషుబాబు విజేత ముత్యాలపాడు జట్టును అభినందించారు. ఈ జట్టు నియోజకవర్గ స్థాయిలో ఆడుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కన్నె కృష్ణ, వైసీపీ నాయకులు కన్నె రాజారావు, డిజిటల్ అసిస్టెంట్ జైనులాబ్దిన్, సోషల్ మీడియా ఆర్గనైజర్ గుండాబత్తిన కొండలరాయుడు పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతు పనుల పరిశీలన



మంచినీటి పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కావలి, జనవరి 20: కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులోని ఐడీఎస్ఎంటీ కాలనీ వద్ద మరమ్మతులకు గురైన మంచినీటి పైపులైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్ కుమార్ తెలిపారు. పైపులైన్ మరమ్మతు పనులను శనివారం ఆయన పరిశీలించారు. మూడు రోజులలో దీని నిర్మాణం పూర్తి చేసి పట్టణ ప్రజలకు తాగునీరు ఇవ్వాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

లింగసముద్రం, జనవరి 20 : మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై గ్రామాలలో సామాజిక తనిఖీ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో ఉపాధిహామీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి పథకానికి సంబంధించి జరిగిన సుమారు 300 పనులపై రూ.10 కోట్ల మేర ఖర్చు చేశారని డీఆర్‌పీల బృందం ఇన్‌చార్జ్ స్టేట్ రిసోర్స్ పర్సన్ (ఎస్ఆర్‌పి) లోకేష్ చెప్పారు. గ్రామాలలో ఇంటింటికీ తిరిగి కూలీలను విచారించి, చేసిన పనులను కూడా పరిశీలిస్తారని చెప్పారు. అలాగే విచారణ అనంతరం గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి, విచారణ నివేదికను గ్రామ ప్రజలకు చదివి వినిపించడం జరుగుతుందన్నారు. ఈ విచారణ ఈనెల 27వ తేదీ వరకు జరుగుతుందన్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో విచారణ పూర్తయిన అనంతరం లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రజావేదిక నిర్వహించే తేదీని తరువాత తెలియజేయనున్నట్లు తెలిపారు.

అన్ని వర్గాల వారిని మోసం చేసిన జగన్ : బొల్లినేని



ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందచేస్తున్న బొల్లినేని వెంకటరామారావు

వింజమూరు, జనవరి 20 : పట్టణంలోని సిద్ధార్థనగర్, అశోక్‌నగర్‌లలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మాజీ శాసన సభ్యులు, టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు పాల్గొని మాట్లాడుతూ వైసీపీ పాలనలో జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారిని మోసం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ ఎస్టీ సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే టీడీపీ- జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీని సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు గొంగటి రఘునాథరెడ్డి, నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, ఆర్ క్రిష్టయ్య, కొండపల్లి వెంకటేశ్వర్లు, భాష్యం నాయుడు, చావా మహేంద్ర, చల్ల శ్రీను, మంచాల శ్రీనివాసులునాయుడు, గుమ్మా మాలకొండయ్య, జనసేన నాయకులు బండారు లక్ష్మీనారాయణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నేత పెంచలయ్య మృతికి పలువురి సంతాపం

బిట్రగుంట, జనవరి 20: బోగోలు మండల సీనియర్ నాయకుడు తూపిలి పెంచలయ్య (83) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కావ్యకృష్ణారెడ్డి పెంచలయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి మాజీ ఏఎంసీ చైర్మన్ సుకుమార్‌రెడ్డి ఫోన్లో కుటుంబ సభ్యులతో మాట్లాడి సానుభూతి తెలియచేశారు. వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు, సీనియర్ నేతలు అంకులయ్య, రమణయ్య, మాల్యాద్రి, వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు, మాధవరావు, వేంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, కాంగ్రెస్ నాయకుడు జహీర్, సీపీఎం నాయకుడు వెంకయ్య, పీఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు వెంకటేశ్వర్లు, కావలి, అల్లూరు, దగదర్తి మండలాలకు చెందిన వివిధ పార్టీల నేతలు పెంచలయ్య మృతికి సంతాపం తెలియచేశారు. బోగోలులో జరిగిన అంత్యక్రియలో పాల్గొన్నారు.

కావలి టీడీపీ టికెట్ పసుపులేటికి ఇవ్వాలి

● మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్ నాయుడు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్‌నాయుడు

కావలి టౌన్, జనవరి 20: కావలి టీడీపీ టికెట్ బీసీ వర్గానికి చెందిన పసుపులేటి సుధాకర్‌కు ఇవ్వాలని మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్‌నాయుడు కోరారు. శనివారం పీఎస్సార్ ట్రస్ట్ ప్రభాకర్‌నాయుడు ఆసుపత్రిలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ ఆశయాలనకునుగుణంగా కావలి ఎమ్మెల్యే టిక్కెట్ బీసీ కులానికి చెందిన పసుపులేటి సుధాకర్‌కు కేటాయించాలన్నారు.

వాసవీ క్లబ్ లెజెండ్స్ కార్యవర్గం ఎన్నిక



బాధ్యతలు స్వీకరించిన వాసవీక్లబ్ లెజెండ్స్ కార్యవర్గం సభ్యులు

కందుకూరు, జనవరి 20: కందుకూరు వాసవీక్లబ్ లెజెండ్స్ ప్రెసిడెంట్‌గా రవ్వా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఇన్నమూరి శ్రీను, కోశాధికారిగా చీదెళ్ల కృష్ణలను ఎన్నుకున్నారు. వనితాక్లబ్ ప్రెసిడెంటుగా నటరాజకుమారి, ప్రధానకార్యదర్శిగా నారాయణ సుకన్యలు నియమితులయ్యారు. వాసవీక్లబ్ జిల్లా ఇన్‌చార్జి గుర్రం మంజులకుమారి, జోన్ చైర్మన్ కోట వెంకటేశ్వర్లు వీరికి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో చక్కా కేశవరావు, హేమంత్, చీదెళ్ల హరి తదితరులు పాల్గొన్నారు. కాగా, తటవర్తి హేమంత్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో రహదారుల వెంట గుడారాలలో నివసిస్తున్న సంచారజాతుల వారికి శనివారం అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు.

పల్లెల్లో దోమల స్వైరవిహారం

● వ్యాధులతో అల్లాడుతున్న ప్రజలు

అల్లూరు, జనవరి 20 : మండలంలోని గ్రామాల్లో ప్రజలు దోమలతో అల్లాడుతున్నారు. మురికి కాలువలు దోమల ఉత్పత్తికి కారణమవుతున్నాయి. గత ప్రభుత్వాల్లో ఈ సీజన్‌లో ఇంటింటికీ వైద్య, ఆరోగ్య సిబ్బంది వెళ్లి అవగాహన కల్పించి నీటి నిల్వలు లేకుండా చూడడంతోపాటు ఆయిల్ బాల్స్‌ను వినియోగించి మురికి గుంటలు, కాలువల్లో లార్వా ఉత్పత్తి కాకుండా చర్యలు తీసుకునేవారు. ఈ ప్రభుత్వంలో ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, ఇప్పటికైనా నగర పంచాయతీ, గ్రామ పంచాయతీల అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. గత రెండు నెలలుగా అల్లూరు నగర పంచాయతీతోపాటు మండలంలోని గ్రామాల్లో దోమల ఉధృతి తీవ్రంగా ఉంది. దోమల దాడితో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టి వ్యాధుల బారి నుండి ప్రజలను కాపాడాలని మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్ రాజు కోరుతున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



నృసింహుడి కళ్యాణం నిర్వహిస్తున్న పండితులు

కమనీయం నృసింహుడి కల్యాణం

రాపూరు(డక్కిలి), జనవరి 20 : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని నృసింహ స్వామి ఆలయంలో శనివారం చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత నరసింహ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేదపండితులు, అర్చకుల మంత్రోచ్చరణలు, మేళతాళాల నడుమ స్వామి వారి కల్యాణం, తిరుచ్చి పల్లకీ సేవ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఏసీ కే.జనార్ధనరెడ్డి పర్యవేక్షించారు.

నిత్యన్నదానానికి విరాళం : పెంచలకోన పుణ్యక్షేత్రంలో నిత్యాన్నదానానికి బెంగళూరుకు చెందిన హరిప్రసాద్, సింధు తమ తల్లిదండ్రులైన నరసాపురం తిరుపాలయ్య, చెంగమ్మల జ్ఞాపకార్థం రూ.1,51,111 విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ కే.జనార్ధనరెడ్డికి అందచేశారు.

దోచుకోవడానికేనా కాకాణికి పీహెచ్‌డీ : సోమిరెడ్డి

వెంకటాచలం, జనవరి 20 : సర్వేపల్లి నియోజకవర్గంలో దోచుకుంది దాచుకున్నందుకేనా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పీహెచ్‌డీ అని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలోని గొలగమూడిలో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత వెంకయ్యస్వామి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు భూపంపిణీ పేరిట సర్వేపల్లిలో భారీగా భూకుంభకోణం జరిగిందన్నారు. గ్రామ సభలు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. పేదలకు సహాయం చేస్తారంటే తాము మద్దతు ఇస్తామే తప్ప కాకాణిలా కోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చి అడ్డుకునే సంస్కృతి మాది కాదన్నారు. గత టీడీపీ హయంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు సర్వేపల్లిలో 1500 ఎకరాలకు పట్టాలను అసైన్మెంట్ కమిటీలో పెట్టి అప్రూవల్ చేయిస్తే, వైసీపీ అధికారంలోకి రాగానే కాకాణి వాటిని రద్దు చేయించి రాక్షసానందం పొందారని విమర్శించారు. ఇప్పటికే రామదాసు కండ్రిగను పూర్తిగా ముంచేశారని, త్వరలో దాని సంగతి తెలుస్తామన్నారు.



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న సోమిరెడ్డి

కార్యక్రమంలో రాజాయాదవ్, నాగేంద్రప్రసాద్, రాధాకృష్ణమనాయుడు, బొమ్మి సురేంద్ర, శ్రీనివాసులునాయుడు, పార్థసారథి నాయుడు, సత్తార్ సాహెబ్, రవినాయుడు, శ్రీనివాసులు, దామోదర్, బ్రహ్మయ్య, సుజిత్, అంకయ్య, కోదండయ్యనాయుడు, నాగార్జున్‌రెడ్డి, రమేష్‌నాయుడు, ధనుంజయ నాయుడు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీల ధర్నా



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

కోవూరు, జనవరి 20 : సమస్యల పరిష్కారం కోసం స్త్రీ శిశు సంక్షేమ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకుడు జొన్నలగడ్డ వెంకమరాజు అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ 40 రోజులైనా సమ్మెను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా సమ్మెను పోలీసులు ద్వారా అణచాలని చూస్తోందన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు విజయకుమార్, సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, మారుబోయిన సుబ్బారావు, షేక్ అఫ్రోజ్, చాన్‌బాషా, రమేష్, అంగన్‌వాడీ నాయకులు ఎల్వి శేషమ్మ, విజయమ్మ, సుజాతమ్మ, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత నీటి సరఫరాకు చర్యలు : మేయర్



నీటిని పరిశీలిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(సిటీ), జనవరి 20 : నగర ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎన్ఎంసీ మేయర్ పోట్లూరి స్రవంతి అధికారులకు సూచించారు. శనివారం పొదలకూరు మండలం మహ్మదాపురం వద్ద ఉన్న 122 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కర్మాగారాన్ని ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరులో ఇటీవల నీటి సరఫరాలో సమస్యలున్నట్లు ప్రజల నుంచి అనుమానాలు వ్యక్తమవడంతో ఈ కేంద్రాన్ని సందర్శించామన్నారు. సురక్షితమైన తాగునీరు అందించే దిశగా అధికారులు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఇక్కడ నుంచి వచ్చే నీరు పైపుల ద్వారా నెల్లూరులోని 31 ట్యాంకుల పరిధిలోని ప్రజలకు దాహార్తిని తీర్చుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

నారాయణను గెలిపించాలి

నెల్లూరు(వెంకటేశ్వరపురం) : రానున్న శాసనసభ ఎన్నికల్లో నారాయణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్ పిలుపునిచ్చారు. నగ రంలోని 54 డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌కాలనీలో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ జగన్‌కు ఓటు వేసి ప్రజలు కష్టాలపాలయ్యారన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే ఈ డివిజన్ పరిధిలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2000 చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక క్లస్టర్ ఇన్‌చార్జి జహీర్, రేవతి, వెంకటేశ్వర్లు, ఖాదర్‌బాబు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కళలతోనే వినోదం, విజ్ఞానం

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 20 : అనాదిగా ప్రజలకు వినోదం - విజ్ఞానం అందించేవి కళలేనని సినీ దర్శకుడు మహేష్ చంద్ర పేర్కొన్నారు. శనివారం పురమందిరంలో ఆయన లింబో చిత్రం ఆడియో రిలీజ్ వేడుకలను ప్రారంభించారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మదీనా వాచ్ అధినేతకు సేవారత్న బిరుదును ఇవ్వడంతోపాటు లింబో చిత్రం ఆడియో సీడీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓంకారమ్మ, మురళీమోహన్‌రాజు, కొండూరు హరినారాయణ రెడ్డి, లింబో చిత్రం యూనిట్ పాల్గొంది.

నేడు రక్తదాన శిబిరం

నెల్లూరురూరల్, జనవరి 20: నెల్లూరురూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2009 నుంచి ఏడాదికి రెండు సార్లు నిర్వహించే రక్తదాన శిబిరాల ద్వారా అనేక మంది ఆపదలో ఉన్న బాధితులకు రక్తాన్ని అందించామన్నారు. రక్తదాతలు పాల్గొన్ని ప్రాణదాతలుగా నిలవాలని ఆయన కోరారు.

నెలాఖరులోపు ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి

పొదలకూరు, జనవరి 20 : నెలాఖరులోపు ఈ క్రాప్‌ల నమోదు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పి.సత్యవాణి అన్నారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సబ్ డివిజన్ పరిధిలోని పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి, మనుబోలు మండలాల వ్యవసాయ సహాయకుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పి.సత్యవాణి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో జనవరి 31లోపు ఈ క్రాప్ నమోదు, ఎరువుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. అలాగే ఈకేవైసీ, పొలంబడి, మ్యాగజైన్ల పంపిణీ, వ్యవసాయ పథకాలపై మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ.నర్సోజీరావు, శేషగిరి, ఏడీఏ కే.శినాయక్, మండలాల ఏఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రసన్న ప్రత్యేక పూజలు

కొడవలూరు, జనవరి 20: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దంపతులు నార్తురాజుపాలెంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహా రుద్రాభిషేకం, సుదర్శన యాగం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి టీడీపీ

నెల్లూరు(వ్యవసాయం) : వైసీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి బీసీలపై అమానుషంగా దాడులు చేసి వారిపైనే తిరిగి అక్రమ కేసు లు బనాయించిన పరిస్థితులు నెలకొన్నాయని తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కార్యాల యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల పక్ష పాతి పార్టీ ఏదైనా ఉందంటే అది టీడీపీ అని చెప్పారు. నగరంలో బీసీ సోద రులకు బీసీ భవన్ కావాలని ఆకాంక్షించిన వ్యక్తి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి అన్నారు. 9 ఏళ్లగా నిరంతరం ప్రజల్లో ఉన్న ఆయన్ను వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, క్లస్టర్ ఇన్‌చార్జిలు జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, నెల్లూరు మురళి, కంటే సాయిబాబా, మన్నేపల్లి రఘు, మాజీ ఏఎంసీ చైర్మన్ హరిబాబుయాదవ్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



కల్యాణ వేదికపై శివపార్వతులు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 20: సనాతన హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా మూలాపేట మూలస్థానేశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని సంతపేట అరణి కందప్పమేస్త్రి సత్రం లో శివపార్వతుల కల్యాణం క నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అభిషేకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరి గాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయకర్తలు, ధర్మకర్తలు, తదితరులు, పర్యవేక్షించారు.

రేపటి నుంచి 'భక్తుల వద్దకు భగవంతుడు'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మంచికంటి, ఈవో

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 20 : సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు తల్పగిరి రంగనాథస్వామి ఆలయం ఆధ్వర్యంలో భక్తుల వద్దకు భగవంతుడు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 7 ప్రాంతాలలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. 22న శెట్టిగుంటరోడ్డులోని సత్రంబడి, 23న నవాబుపేటలోని ఉడయవర్లు దేవస్థానం, 24న పెద్దబజారు సెంటర్‌లో, 25న బాలాజీనగర్ సీతారామమందిరం వీధి, 26న సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానం, 27న స్టోన్‌హౌస్‌పేటలోని పప్పులవీధి ఆంజనేయస్వామి ఆలయం, 28న రంగనాథస్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు అభినందన సభ : తల్పగిరి రంగనాథస్వామి ఆలయ ధర్మకర్తల మండలికి ఆదివారం ఉదయం అభినందన సభ జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిటీ ఎమ్మెల్యే పి.అనీల్‌కుమార్‌యాదవ్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ధర్మకర్తలు సాదా గోపి, వీరేపల్లి పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

3న జనం చెంతకు జగన్నాథ రథయాత్ర



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 20 : ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3వ తేదీన 11వ జగన్నాథ రథయాత్ర నగరంలో నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డాక్టర్ శుకదేవస్వామి, వీవీ గిరి తెలిపారు. ఇస్కాన్ మందిరంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో రథయాత్ర కరపత్రాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ రథయాత్ర 3వ తేదీ సంతపేట 4కాళ్ల మండపం వద్ద మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి ఏసీ బొమ్మ, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, వీఆర్‌సీ, ముత్తుకూరు గేట్, మినీబైపాస్ రోడ్డు, అన్నమయ్య సర్కిల్ మీదుగా పీవీఆర్ కల్యాణ మండపంకు చేరుతుందని తెలిపారు. కల్యాణ మండపంలో రాత్రి 7.30 గంటలకు స్టేజీ ప్రోగ్రామ్ జరుగుతుందన్నారు.

ఇస్కాన్ క్యాలెండర్ ఆవిష్కరణ : ఇస్కాన్ ముద్రించిన 2024 సంవత్సరం క్యాలెండరును శనివారం తన గృహంలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠలో భాగస్వాములు కండి



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 20 : ఈనెల 22న శ్రీరామ జన్మభూమి అయోధ్యలో జరిగే శ్రీరామచంద్ర మూర్తి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి అనుసంధానంగా ప్రపంచ వ్యాప్తంగా జరిగే కార్యక్రమాల్లో భాగంగా నెల్లూరు నగరంలో అన్ని ప్రధాన దేవాలయా ల్లో ఉదయం నుంచి శ్రీరామచంద్రమూర్తి భజనలు, కీర్తనలు, కోలాటాలు నిర్వహి స్తున్నట్లు శ్రీరామ మందిరం ఉత్సవ పర్యవేక్షణ కమిటీ నెల్లూరు ప్రతినిధులు తెలి పారు. శనివారం స్థానిక టీవీఎస్ కల్యాణ సందన్‌లో జరిగిన విలేకరుల సమావేశం లో అధ్యక్షుడు మోదం మల్లికార్జున్‌రావు, నెల్లూరు నగర కార్యక్రమ పర్యవేక్షకుడు పి.సురేంద్రరెడ్డి, వీహెచ్‌పీ విభాగ కార్యదర్శి ఏవీఆర్ మోహన్‌రావు, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు కొండపల్లి శ్రీకాంత్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి మాట్లాడారు. ఐదు శతాబ్దాల తర్వాత అయోధ్యలో బాలరాముడి నూతన విగ్రహ ప్రతిష్ఠ జరుగు తుందన్నారు. ఈ సందర్భంగా 22న మధ్యాహ్నం 11గంటల నుంచి 1గంట వరకు ఎల్‌ఈడీ స్ర్కీన్ల ద్వారా అయోధ్య ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా భక్తులకు వీక్షించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వినియోగం జరుగుతుందని తెలిపారు. ఈ పవిత్రమైన రోజున ప్రతి ఇంట్లో పూజా కార్యక్రమా, సాయంత్రం పంచ దీప ఆరాధనలు వెలిగించి శతకోటి దీపోత్సవాన్ని విశ్వవ్యాప్తంగా సామూహికంగా జరిపేందుకు భాగస్వాములు అవుతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శివాజీ సెంటర్ నిర్వాహకులు బీఎస్ రంగరాజన్, పేలేటి భాస్కర్, హర్షవర్ధన్, శివకుమార్, డీటీ హరికృష్ణ, యశ్వంత్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు శోభాయాత్రను జయప్రదం చేయండి

పొదలకూరు : అయోధ్య రామమందిరం బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో జరిగే భారీ శోభాయాత్రను జయప్రదం చేయాలని నిర్వాహకులు మన్నెం శ్యామ్‌ప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, వాకాటి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం స్థానిక శ్రీనివాస నగర్‌లో వెలసి ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపు ఉదయం 9గంటలకు రామ్‌నగర్ గేట్ సెంటర్ నుంచి రామమందిరం మీదుగా ప్రధాన రహదారిపై ఈ భారీ శోభాయాత్ర జరుపుతున్నట్లు తెలిపారు. ఈ శోభాయాత్రలో రామభక్తులు, పట్టణ ప్రజలు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రేపటి నుంచి మహా కుంభాభిషేకాలు

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 20 : నగరంలోని చిల్డ్రన్స్ పార్కు వద్ద గల శ్రీవిద్యా గణపతి ఆలయంలో ఈనెల 22 నుంచి మహాకుంభాభిషేకాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త పాజెర్ల శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 22న రాత్రి అంకురార్పణ, 23న విశేషపూజలు, హోమాలు, 24న ఉదయం 10 గంటలకు విమాన గోపురంకు అభిషేకం, మూలవిరాట్ విద్యా గణపతికి పరిచార దేవతలకు మహాకుంభాభిషేకం, 11గంటలకు మూలమూర్తులకు మహాభిషేకం, అన్నప్రసాద వితరణలు జరుగుతాయని తెలిపారు.

నేడు అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం : నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం జరుగుతుందని ఆలయ చైర్మన్ జి.శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి గణపతి హోమం, నవకలిశాభిషేకం, పుష్పార్చనలు, కేరళ తంత్రులచే జరుగుతాయని పేర్కొన్నారు.

రెచ్చిపోయిన దొంగలు

నెల్లూరు(క్రైం), జనవరి 20 : బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో గొలుసు దొంగలు రెచ్చిపోతున్నారు. శుక్రవారం రాత్రి ఇద్దరు మహిళల మెడల్లోని బంగారు గొలుసులను తెంపుకెళ్లారు. సరస్వతి నగర్‌లో నివాసం ఉంటున్న వృద్ధురాలు రమణమ్మ శుక్రవారం రాత్రి ఆమె ఇంటిముందు నిలబడి ఉం డగా ఇద్దరు గుర్తుతెలియని దుండగులు బైక్‌పై వచ్చారు. అడ్రస్ అడుగుతున్నట్లు నటిస్తూ ఆమె మెడలోని ఐదు సవర్ల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

● ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన సరోజనమ్మ, వెంకటరత్నం దంపతులు. వారు ఇంటివద్దనే చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో సరోజనమ్మ దుకాణంలో ఉండగా గుర్తుతెలియని ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చారు. వాటర్ బాటిల్ తీసుకుని డబ్బులు ఇస్తున్నట్లు నటిస్తూ ఆమె మెడలోని మూడు సరవ్ల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీకి ఓటేస్తేనే రాష్ట్రానికి భవిష్యత్

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



దుకాణదారుడితో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, జనవరి 20 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలిస్తేనే ఏపీకీ మంచి భవిష్యత్ ఉంటుందని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఒక్కడినే ఒంటరిగా కార్యక్రమంలో భాగంగా శనివారం 27వ డివిజన్ ఎల్ఎస్ఆర్ పెట్రోల్ బంకు నుంచి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి అనే పథమే లేదన్నారు. అన్ని వర్గాలు నిర్వీర్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తిరిగి రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. నెల్లూరురూరల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి తనను మరొకసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సచివాలయాల్లో కమిషనర్ తనిఖీ



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(సిటీ), జనవరి 20 : నెల్లూరు నగరంలోని ఆకుతోట, మాగుంట లేఅవుట్, న్యూ మిలటరీకాలనీ, కోనేటిమిట్ట ప్రాంతాల్లోని సచివాలయాలను ఎన్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాజాగా జరుగుతున్న కులగణన కార్యక్రమంపై ఆరా తీసిన ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అందజేస్తున్న పథకాలపై ఆరా తీశారు. అర్హత కలిగిన వారందరికీ ప్రభుత్వ పథకాల్లో స్థానం కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల వినతులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు.

నెల్లూరురూరల్లో 'అభద్రత'

● గ్రామాల్లో దొంగలు హల్‌చల్ ● కొరవడిన పోలీసు నిఘా



నెల్లూరురూరల్, జనవరి 20 : గ్రామాల్లో దొంగలు హల్‌చల్ చేస్తుండడం, రాత్రుళ్ల పోలీసు పెట్రోలింగ్ వాహనాల హారన్లు మూగబోవడంతో నెల్లూరురూరల్లోని ప్రజలను అభద్రత వెంటాడుతోంది. అలాగే శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడింది. అవాంఛనీయ ఘటనల పై నిఘా ఉంచాల్సిన క్రైం పార్టీ పూర్తిగా చేతులెత్తేసింది. నగరం నుంచి 5 రూట్లు రూరల్ ప్రాంతానికి ఉండగా వీటిల్లో రోజుకు మూడు రూట్లలోనే బీట్లు వేస్తున్న అధికారులు మిగిలిన రెండు రూట్లలో బీట్లను ఎత్తేశారు. ఇసుక, గ్రావెల్, మట్టి వంటి సహజవనరులు స్మగ్లింగ్ జరిగే రూట్లలో బీట్లను మార్చుతూ అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారంటూ రూరల్ పోలీసులపై విమర్శలున్నాయి. నెలమామూళ్లలో రూరల్ పోలీసు స్టేషన్ టాప్‌వన్‌లో ఉన్నట్లు ఆరోపణలున్నాయి. వ్యవసాయ సీజన్ ముమ్మరంగా ఉన్న ఈ సమయంలో మోటార్ల చోరీలు జరిగే అవకాశాలున్నాయి. ఆలయాల్లో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. నగర శివారునున్న కూడళ్ల, ప్రధాన రహదారులపై అల్లరిమూకల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. పగలు, రాత్రి తేడాలేకుండా నివాసాలకు సమీపంలో మందుబాబులు ఓపెన్ డ్రికింగ్‌తో హల్‌చల్ చేస్తున్నారు. పెన్నా పరివాహకం నుంచి ఇసుక, నగర సమీపంలో చెరువుల్లో గ్రావెల్, మట్టి ప్రతి నిత్యం టిప్పర్ల ద్వారా తరలిపోతోంది. వీటన్నిటికి కళ్లెం వేయాల్సిన రూరల్ పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రజల భద్రతను గాలికొదిలేసిన ఆదాయ వనరులపైనే దృష్టి సారించారన్న విమర్శలు లేకపోలేదు. ప్రజలతో తత్సంబంధాలు పెట్టుకుని, శాంతిభద్రతలను పర్యవేక్షణలో కీలకంగా పనిచేయాల్సిన క్రైం పార్టీ దండకాలకు పరిమితమైందన్న ఆరోపణలు మూటకట్టుకుంది. పేకాట, కోడిపందేలు, వ్యభిచారం లాంటి అసాంఘిక కార్యక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నట్లు సమాచారం.

మూడు బీట్లతో సరి : నెల్లూరు నగరానికి ఐదు రూట్ల ద్వారా ప్రధాన రహదారులతో రూరల్ స్టేషన్ పరిధి ఉండగా రోజుకు మూడు బీట్లతోనే పోలీసు నిఘాను సరిపెట్టేస్తున్నారు. కల్లూరిపల్లి, ధనలక్ష్మీపురం, నారాయణరెడ్డిపేట ప్రాంతాల వైపు రాత్రుళ్ల బీటు పోలీసులను పంపుతున్న అధికారులు గ్రామాలతో సంబంధాలున్న పొట్టేపాళెం, ఆమంచర్ల రూట్ల వైపు పూర్తిగా బీట్లను ఎత్తేశారంటూ ప్రజలు వాపోతున్నారు. దొంగతనాలు ఎక్కువగా ఈ ప్రాంతాలలోనే జరుగుతున్నా రాత్రుళ్ల పెట్రోలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం గమనర్హం.

నెల మామూళ్లలో టాప్ : నెల్లూరు సిటీ, గ్రామీణ ప్రాంతాలతో సంబంధాలున్న రూరల్ పోలీసు స్టేషన్ నెలవారి మామూళ్లలో టాప్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. కోడూరుపాడు నుంచి రాత్రుళ్ల ఒక్కో ఇసుక ట్రాక్టర్ ద్వారా నెలకు రూ.15 వేలు వసూళ్ల చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక నెల్లూరు - ముత్తుకూరు రహదారిపై బూడిద లారీల ద్వారా మామూళ్ల స్టేషన్‌కు చేరుతున్నట్లు తెలుస్తోంది. నెల్లూరు నుంచి రూరల్ పరిధి మీదుగా పలు ప్రాంతాలకు వెళ్లే కాయకూరలు, మాంసపు వ్యర్థాల వాహనాలను నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. మట్టి, గ్రావెల్ రవాణా వాహనాల నుంచి నెలవారి మామూళ్ల అందుతున్నట్లు తెలుస్తోంది. ఈ తరహా వసూళ్ల దందాను కొన్ని నెలలుగా స్టేషన్‌లోని ఓ ఏఆర్ కానిస్టేబుల్ స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఇటీవల బాధ్యతలు తీసుకున్న సీఐ లోతైన విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్న వాదన అదే స్టేషన్లో వినిపిస్తోంది.

వెంటాడుతున్న వాహన కొరత : నెల్లూరురూరల్ పోలీసు స్టేషన్ పరిధి ఎక్కువగా ఉండటం వల్ల రాత్రుళ్ల పూర్తి స్థాయిలో నిఘా ఉంచలేకపోతున్నామని, అందుకు వాహనాల కొరత ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. ప్రతి బీట్లకు ఒక వాహనం మాత్రమే అందుబాటులో ఉండటం వల్ల పరిమితి స్థాయిలోనే పెట్రోలింగ్ నిర్వహించాల్సి ఉందని, స్టేషన్ పరిధిని బట్టి పోలీసు ఉన్నతాధికారులు వాహనాలు కేటాయిస్తే అన్ని ప్రాంతాల్లో గస్తీ పెట్టేందుకు వీలవుతుందన్న వాదనను వ్యక్తం చేస్తున్నారు.


రెడ్‌క్రాస్‌లో చిన్నారులకు తలసీమియా వైద్యం



మాట్లాడుతున్న డాక్టర్ అమరేష్‌రెడ్డి

నెల్లూరు(వైద్యం), జనవరి 20: ఇండియన్ రెడ్‌క్రాస్‌లో చిన్నారులకు శనివారం తలసీమియాకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ అమరేష్‌రెడ్డి పాల్గొని చిన్నారులకు పరీక్షలు చేశారు. షుగర్, థైరాయిడ్ చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, సలహాదారు డాక్టర్ హరిత, కన్వీనర్ సీత, కో కన్వీనర్ షేక్ పర్వీన్ సేవలను కొనియాడారు. డాక్టర్ సీత మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరం లో పాల్గొన్న డాక్టర్ అమరేష్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, సాయిరామ్, కార్యదర్శి మస్తానయ్య, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 21 జనవరి 2024

"తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో జరిగిన తప్పిదాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటాం సరే... చేయించిన వారి సంగతేమిటి? ఎపిక్ కార్డులనేవి ఎన్నికల సంఘం ఆస్తి. మా ఆస్తిని కాజేయాలని చూస్తారా? ఇక్కడ ప్రజాస్వామ్యం వున్నట్టా? లేనట్టా? అధికారులు, ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి ఓటరు ఐడీ కార్డులు డౌన్‌లోడ్ చేయించిన వారెవరో తేల్చాలి...వారికి శిక్ష పడేలా చూడాలి... " ఇదీ కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారికి జారీచేసిన ఆదేశం. దీంతో ఓటరు ఐడీ కార్డుల డౌన్‌లోడ్, నకిలీ కార్డుల తయారీ వ్యవహారంలో సూత్రధారులెవర్నది తేల్చడానికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడు టెక్నికల్ టీములు ఏర్పాటయ్యాయి.మరోవైపు వివిధ రాజకీయ పక్షాల నాయకులు దొంగ ఓటర్ల వ్యవహారంపై ఇచ్చిన ఫిర్యాదుల పురోగతి, స్టేటస్ ఏమిటన్నది తేల్చడానికి విడిగా మరికొందరు అధికారులతో బృందాలు నియమితమయ్యాయి. దీంతో అధికారులను ముందు పెట్టి తెరవెనుక నుంచీ తతంగం నడిపించిన సూత్రధారులెవరన్నది త్వరలోనే వెలుగులోకి రానుంది.



తిరుపతిలో దొంగ ఓటర్ల వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న సీఈసీ

చేసిన అధికారులపై చర్యలు సరే... చేయించిన వారి సంగతేమిటని ప్రశ్న

సూత్రధారుల సంగతేంటి?

సాంకేతిక అంశాల దర్యాప్తునకు టెక్నికల్ టీముల ఏర్పాటు

పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుల స్టేటస్ కోసం విడిగా బృందాలు

తిరుపతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలే లక్ష్యంగా తయారు చేయించిన దొంగ ఓటర్ల వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణిస్తోంది.ఈ వ్యవహారంలో తిరుపతి సెగ్మెంట్‌కు అప్పట్లో ఈఆర్వోగా పనిచేసిన నాటి తిరుపతి మున్సిపల్ కమిషనర్, ఇటీవలి వరకూ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన గిరీషాను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అలాగే అప్పటి తిరుపతి సెగ్మెంట్ ఏఈఆర్వోగా పనిచేసిన తిరుపతి అర్బన్ తహసిల్దారు జయరాములు, ఎలక్షన్ డీటీగా పనిచేసిన విజయ్‌భాస్కర్ కూడా సస్పెండయ్యారు. రికార్డుల ఆధారంగా ఈ వ్యవహారానికి బాధ్యులైన అధికారులందరిపై ఈసీ చర్యలకు ఉపక్రమిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి సమాంతరంగా మరో ప్రక్రియ మొదలైనట్టు తెలిసింది. పాత్రధారులైన అధికారులపై చర్యలు తీసుకుంటున్నామని, అయితే అధికారులతో ఈ తతంగం నడిపించిన సూత్రధారులెవరో తేల్చాలని ఈసీ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారిని ఆదేశించినట్టు తెలిసింది. సంబంధిత అంశంపై విచారణ త్వరగా ముగించి నివేదిక ఇవ్వాలని షరతు విధించినట్టు తెలిసింది. ఒకవేళ చేయలేని పరిస్థితి వుంటే తాము ఇతర ఏజెన్సీల ద్వారా సొంతంగా చేయించుకుంటామని కూడా స్పష్టం చేసినట్టు తెలిసింది. దీంతో సాంకేతిక అంశాలను తెలుసుకునేందుకు డీఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో మూడు టెక్నికల్ బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఆ బృందాలు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించాయని కూడా సమాచారం.ఈ బృందాలు ఎక్కడెక్కడ, ఏ కంప్యూటర్ సిస్టమ్స్ ద్వారా ఓటరు ఐడీ కార్డులు డౌన్‌లోడ్ చేశారు? ఎవరెవరి లాగిన్లలో చేశారు? ఎన్ని సెషన్లలో ఎన్నెన్ని కార్డులు డౌన్‌లోడ్ చేశారు?ఆయా కంప్యూటర్లు ఎవరు వినియోగించారు? వాటి ఐపీ అడ్రసులు ఏవి? వినియోగించిన నెట్ కనెక్షన్ ఎవరిది? మొబైల్ ద్వారా నెట్ వినియోగించి వుంటే ఆ మొబైల్ ఫోన్లు ఎవరివి?... ఇలా సాంకేతిక అంశాలను నిగ్గు తేల్చేందుకు యత్నిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ మున్సిపల్, రెవిన్యూ కార్యాలయాల్లో కాకుండా ప్రైవేటు కార్యాలయాలు, ఇళ్లలో గనుక ఈ తతంగం నడిచివుంటే, ప్రైవేటు కంప్యూటర్లు, ప్రైవేటు ఇంటర్‌నెట్ కనెక్షన్లు వినియోగించి వుంటే ప్రైవేటు వ్యక్తుల గుట్టు రట్టవుతుంది. వారి ద్వారా తెరవెనుక కుట్రదారులెవరన్నది తేలనుంది.

ఫిర్యాదుల పురోగతిని తేల్చే పనిలో మరిన్ని బృందాలు

మరోవైపు ఇతర జిల్లాలకు చెందిన డీఎస్పీ స్థాయి అధికారులకు ఇతర బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. తిరుపతి సెగ్మెంట్‌లో దొంగ ఓటర్లకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నాయకుల నుంచీ, వ్యక్తుల నుంచీ అందిన ఫిర్యాదులు ఏమయ్యాయనే కోణంలో ఈ విచారణ సాగనుంది. పోలీసు స్టేషన్లలో ఇచ్చిన ఫిర్యాదులు నమోదయ్యాయా? కాలేదా? నమోదై వుంటే దర్యాప్తు చేశారా? నిందితులను అరెస్టు చేశారా? ఛార్జిషీట్లు వేశారా? కోర్టులో ప్రస్తుతం ఆ కేసులు ఏ దశలో వున్నాయి? వంటి అంశాలను పరిశీలించి కేసుల స్థితిని ఈ బృందాలు నివేదించాల్సి వుందని సమాచారం. దీనికోసం పొరుగు జిల్లా నుంచీ ఇద్దరు డీఎస్పీలు ఇప్పటికే పలు మార్లు తిరుపతి వచ్చి వివరాలు సేకరించినట్టు తెలిసింది.

కీలకం కానున్న ఆ ఎమ్మెల్యే ఆడియో క్లిప్

తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లకు సంబంధించి అప్పట్లో ఓ వైసీపీ ఎమ్మెల్యే చేసిన ఫోన్ సంభాషణ తాలూకూ ఆడియో క్లిప్పింగ్ కీలకం కానుంది. ఎక్కడి నుంచో ఓ వ్యక్తి సదరు ఎమ్మెల్యేకి పోలింగ్ ముందురోజు ఫోన్ చేసి 450 మంది ఓట్లు వేయడానికి సిద్ధంగా వున్నారని, వారిని తీసుకురమ్మంటారా అని అడగడంతో వారి మధ్య జరిగిన సంభాషణ ఆడియో క్లిప్ అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అయింది. ఆ సంభాషణ యథాతథంగా...

సార్... రామ్ మాట్లాడతారు అన్న మాటతో సంభాషణ ప్రారంభమైంది.

ఎమ్మెల్యే : ఇప్పుడూ ఇంత రేత్రిలో కష్టమూ... వచ్చినా టైమ్ సరిపోదని మనోళ్ల ఫీలింగ్

రామ్: అవునా సర్

ఎమ్మెల్యే ఓటింగ్ టైమ్ సరిపోదు

రామ్: అంటే మనకు నైన్ అవర్సే కదా సర్ జర్నీ

ఎమ్మెల్యే : లేదు హడావిడైపోతుంది. 450 మందిని... ఏడు బస్సులు కాదు పన్నెండు బస్సులు కావాలి.

రామ్: లేదు సర్ ఫిఫ్టీ మెంబర్స్ కెపాసిటీ కదా సర్.

ఎమ్మెల్యే అవునయ్యా తొమ్మిది బస్సులు కావాలి. తొమ్మిది బస్సుల్లో వచ్చి మధ్యలో ఆపుతారు.చాలా ఇష్యూస్ వుంటాయి ఇక్కడ. దారిపొడుగూకూ ఆపుతారు.

రామ్: అంటే మన టీమ్ వస్తున్నారు కద సార్. ఎంప్లాయిస్ వీళ్ళు కో ఆర్డినేట్ చేసుకుంటారు

ఎమ్మెల్యే: అది ముందు చూసుకోవల్ల... రెండు రోజుల ముందనుకోని వుంటే ప్లాన్ చేసుకోని వుండచ్చు

రామ్: ఆల్‌రెడీ మేమెప్పుడో చెప్పాము సార్ ఇది

ఎమ్మెల్యే: నాతో డిస్కస్ చేయలేదు ఎవరూ

రామ్: మేము సార్ గారికి చెప్పాము... మీకు పంపించమని చెప్పేసరికి మేము

ఎమ్మెల్యే: ఇప్పుడు అందరినీ నిద్ర లేపి... నాలుగు గంటలకు బయల్దేరిపిచ్చి

రామ్: లేదు సర్ ఆల్రెడీ అందరికీ మేము

ఎమ్మెల్యే: ఈ 400 ఓట్లు ఇక్కడేసుకుంటాములే... ఏదో రకంగా మేనేజ్ చేసుకుని... వాళ్ల ఓట్లు మనం ఎవరో ఒకరితో వేయించుకునేస్తే సరిపోతుంది... ఎందుకు పాపం వాళ్ళకు శ్రమ... మళ్ళా వచ్చి వెళ్లిపోవల్ల కదా... అంత శ్రమవద్దులే.. 400 ఓట్లు ఈడ వేసేసుకోవచ్చులే...

రామ్: సరే సర్

ఈ ఆడియో క్లిప్ అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొట్టింది. ప్రత్యేకించి తిరుపతి ప్రాంతంలో బాగా సర్క్యులేట్ అయింది. దీంట్లో సంభాషణ వింటే బహుశా హైదరాబాదులో ఏదైనా కంపెనీ లేదా ఫ్యాక్టరీ వంటిచోట పనిచేస్తున్న తిరుపతి ప్రాంతానికి చెందిన 450మందిని తిరుపతికి తరలించి వారితో ఓట్లు వేయించేందుకు ఏర్పాట్లు చేసినట్టుగా వుంది. అది కూడా పోలింగ్ ముందురోజు రాత్రి ఫోన్ సంభాషణ జరిగినట్టు వుంది. పోలింగ్ రోజు తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి 9 గంటల్లో తిరుపతి చేరుకోవడం అంటే ఖచ్చితంగా హైదరాబాదు నుంచీ తరలించే ప్రయత్నమేనని భావించాల్సి వచ్చింది. ప్రయాణ వ్యవధి 9గంటలే అయినా మధ్య మధ్యలో పోలీసు, రవాణా శాఖల అధికారులు ఆపి తనిఖీ చేయడం, ఇతర అవసరాలకు వాహనాలు ఆపితే తిరుపతి చేరుకునే సరికి పోలింగ్ సమయం ముగిసిపోయే అవకాశమున్నందునే ఆ ప్రయత్నం విరమించుకుని వారి ఓట్లను ఇక్కడే ఎవరితోనైనా వేయించేయాలన్న నిర్ణయానికి వచ్చారని అనిపించింది. ఆడియో క్లిప్పింగ్ విన్న స్థానిక టీడీపీ నేతలు దీన్ని జత చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. కాగా టీడీపీ అధినేత చంద్రబాబు సైతం దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పోలింగ్ ముగిసిన రెండో రోజు ఈ ఆడియో టేపు వెలుగు చూసింది. ఇపుడు దొంగ ఓటర్ల వ్యవహారంపై ఈసీ విచారణకు, చర్యలకు ఉపక్రమించిన నేపథ్యంలో ఈ ఆడియో టేపు కూడా కీలక ఆధారంగా మారే అవకాశముంది.



తిరుచానూరులో వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది

కులగణనకు సర్వర్ చిక్కులు

● రెండు రోజుల్లో 9శాతంమంది వివరాలు మాత్రమే సేకరణ

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 20: జిల్లావ్యాప్తంగా కులగణన ప్రక్రియకు రెండవ రోజైన శనివారం కూడా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. పలు ప్రాంతాల్లో యాప్ పనిచేయకపోవడంతో వివరాల నమోదు ప్రక్రియ ముందుకు సాగక సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇబ్బందులు పడ్డారు.691 సచివాలయాలను 12,357క్లస్టర్లుగా విభజించగా వాటిలో 9,555క్లస్టర్లలో మాత్రమే కులగణన ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని 7,14,853 ఇళ్లకు గాను రెండ్రోజుల్లో 94,662ఇళ్లను సందర్శించి వివరాలను సేకరించారు. జిల్లావ్యాప్తంగా 13.24శాతం గృహాలు, 9.92శాతం కుటుంబ సభ్యులను సర్వే చేయగలిగారు. కులగణనకు సంబంధించి ప్రతి ఇంటి వద్ద సర్వే చేయడానికి అరగంట సమయం పడుతోందని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. సుమారు 30 ప్రశ్నలకు ఆన్‌లైన్‌లో సమాధానాలు నమోదు చేయాల్సి రావడం, సర్వర్లు అంతంతమాత్రమే పనిచేస్తుండడంతో ఇంటి యజమాని, వలంటీరు, సచివాలయ సిబ్బంది వేలిముద్రలు అప్‌లోడ్ కావడంలేదు.కులగణన ప్రక్రియకు ఈ నెల 28వ తేది వరకు గడువుండగా సర్వర్ సమస్యలు కొనసాగితే ఆ లోపు వివరాలసేకరణ సాధ్యమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మా ఆస్తుల వివరాలతో మీకేం పని?

కులగణన సర్వేలో ఆస్తులు, ఆదాయం, పొలాలు, భూములు, కార్లు వంటి వివరాలను సేకరిస్తున్నారు. వీటితో పాటు ఆవులు, కోళ్లు వంటి వివరాలను కూడా అడుగుతున్నారు.దీంతో చాలామంది వివరాలు చెప్పడానికి ఇష్టపడడం లేదు.ఆస్తులు ఎక్కడెక్కడున్నాయని అడిగితే మీకు కావాల్సింది కుల వివరాలు మాత్రమే కానీ మా ఆదాయ వనరులతో మీకేం పనంటూ జనం నిలదీస్తున్నారు. అధికారులు చెప్పినట్లు చేయాలి కదా అని సచివాలయ సిబ్బంది వివరాల కోసం ప్రాధేయపడుతున్నారు.

24న సీఎం తిరుపతి రాక

తిరుపతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24వ తేదీన ముఖ్యమంత్రి జగన్ తిరుపతి రానున్నారు.జిల్లా అధికార యంత్రాంగానికి అందిన సమాచారం మేరకు ఈనెల 23, 24 తేదీల్లో ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ పేరిట జాతీయ స్థాయి విద్యా సమ్మేళనం తిరుపతిలో జరగనుంది. పలు రాష్ట్రాలకు చెందిన విద్యావేత్తలు పాల్గొంటారని సమాచారం. నగరంలోని హోటల్ తాజ్‌లో జరిగే ఈ రెండు రోజుల కార్యక్రమానికి సంబంధించి 24వ తేదీన సీఎం జగన్ హాజరవుతారు. దీని కోసం 22న విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తిరుపతి వస్తున్నారు. ఆయన వచ్చాకే సీఎం జగన్ పాల్గొనే కార్యక్రమాలు ఖరారవుతాయని జిల్లా అధికారులు చెబుతున్నారు. సీఎంవో నుంచీ వచ్చిన సమాచారంతో శనివారం సాయంత్రం కలెక్టర్ వెంకట్రమణారెడ్డి జిల్లా విద్యా శాఖ అధికారులతో సమీక్షించారు. అనంతరం హోటల్ తాజ్‌కు కూడా వెళ్ళి ప్రాథమికంగా ఏర్పాట్ల గురించి పరిశీలించారు.

అధికారులు అప్రమత్తం

● బోగస్ ఓట్ల పునఃపరిశీలనలో యంత్రాంగం బిజీబిజీ

తిరుపతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):తిరుపతి దొంగ ఓట్ల కుంభకోణంపై ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలతో అధికారులు అప్రమత్తమయ్యారు.ఫైనల్ ఓటరు జాబితాను తప్పుల్లేకుండా చూసే పనిలో పడ్డారు. తిరుపతి అసెంబ్లీకి ఈఆర్వోగా ఉన్న మున్సిపల్ కమిషనర్ హరిత సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకూడదని హెచ్చరిస్తున్నారు. బీఎల్వోలు, ఇతర అధికారులతో కలిసి జాబితాను పునఃపరిశీలిస్తున్నారు. తాజాగా గుర్తించిన నకిలీ ఓట్ల జాబితాను ఇవ్వాలని విపక్ష పార్టీ నేతలను అడిగి తెప్పించుకుంటున్నట్టు సమాచారం. చంద్రగిరి నియోజకవర్గ ఈఆర్వోగా ఉన్న ఆర్డీవో నిషాంత్ రెడ్డిపై కూడా ఈ సీ కొ ర డా ప్రభావం కనిపిస్తోంది. రెవెన్యూ సిబ్బందిని కాకుండా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 10మంది సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకున్నారు. ప్రతి మండలానికీ ప్రత్యేకాధికారులను నియమించి ఓటర్ల జాబితా పునఃపరిశీలనలో బిజీబిజీగా కనిపిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి ర్యాండమ్‌గా తనిఖీ చేస్తున్నారు.గుర్తించిన నకిలీ ఓట్లను తొలగించే పనిలో పడ్డారు. ఈ క్రమంలో వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి పదిమందిపై కేసులు కూడా నమోదు చేసినట్టు తెలిసింది.

ఆ ఓట్ల జాబితా ఇవ్వండి : టీడీపీ

దొంగ ఓట్ల కుంభకోణంలో ప్రధాన పాత్రను వైసీపీ కార్యాలయాలు పోషించాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తిరుపతి ఉప ఎన్నికకు సంబంధించి నాటి ఎలక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్(ఈఆర్వో) లాగిన్ నుంచి దాదాపు 34వేల బోగస్ ఎపిక్ కార్డులు ముద్రించారని ఎన్నికల కమిషన్ గుర్తించిన విషయం తెలిసిందే.ఎన్నికల సంఘం గుర్తించిన దొంగ ఓట్ల జాబితా కావాలని టీడీపీ తిరుపతి ఇన్‌చార్జి సుగుణమ్మ శనివారం కలెక్టర్ వెంకట్రమణారెడ్డిని, కమిషనర్ హరితను కలిసి కోరారు. అయితే ఆ జాబితా తమ వద్దలేదని పోలీసుల విచారణలో ఉందని వారు చెప్పారు.ఈ సందర్భంగా సుగుణమ్మ మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో వైసీపీ నేతల పనులతో అధికారులు బలైపోతున్నారన్నారు. ధర్మయుద్ధం చేయమని తాము పదేపదే చెబుతున్నామని, అయితే వారు దొంగ ఓట్లపైనే ఆధారపడుతున్నారని మండిపడ్డారు. ఫేక్ ఓటరు లేకుండా పునఃపరిశీలన చేసి అసలైన ఓటరు జాబితాతో ఎన్నికల్లోకి రావాలని చెప్పారు. అధికారులు మరింత అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని కోరారు. టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, బుల్లెట్ రమణ, శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, చినబాబు, మహేష్ యాదవ్, పుష్పావతి, కృష్ణ యాదవ్, కంకణాల రజనీకాంత్, కరాటే చంద్ర, ఆముదాల తులసి తదితరులు ఆమె వెంట వున్నారు.

ముక్కంటి సొమ్మును బొక్కేస్తున్నారు...!

● దర్శన టికెట్ల నగదు జేబులో వేసుకున్న ఉద్యోగి

● రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నా సమగ్ర చర్యలేవీ?

శ్రీకాళహస్తి, జనవరి 20 : శ్రీకాళహస్తీశ్వరాలయంలో రోజుకో అవినీతి బాగోతం వెలుగు చూస్తోన్నా సరైన చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఇటీవల ముక్కంటి ప్రత్యేక దర్శన టికెట్ల విక్రయాలు పెరిగాయి. శీఘ్రదర్శనం రూ.200, ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.50గా టికెట్లు నిర్ణయించారు. టికెట్లు జారీ చేయడం తప్ప క్యూలైన్లలో ఎక్కడా వీటిని తనిఖీ చేయరు. కేవలం కౌంటర్లు మాత్రమే కనిపిస్తాయి. కొందరికి టికెట్లు ఇవ్వడం... మరికొందరికి నగదు తీసుకొని లైన్లోకి పంపేయడం జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. అందుకే ఈ టికెట్ల కౌంటర్ల వద్ద పని చేసేందుకు పెద్దఎత్తున లాబీయింగు చేస్తుంటారు. నెల క్రితం రూ.200 టికెట్ కౌంటర్లో కొందరు ఉద్యోగులు భక్తుల నుంచి నగదు తీసుకొని టికెట్లు ఇవ్వకుండా దర్శనానికి పంపారు.ఆలయ డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య మహాద్వారం వద్ద తనిఖీ చేయడంతో ఇది బయటపడింది.అయితే అక్రమార్కులు తమ పలుకుబడితో ఈ విషయాన్ని కప్పేశారు. కౌంటర్లో పనిచేసే ఇద్దరు ఉద్యోగులను ఉన్నతాధికారులు వేరే విభాగానికి బదిలీ చేసి ఊరుకున్నారు. తరువాత ఆ టికెట్లు కౌంటరు ద్వారా రికార్డు స్థాయిలో అమ్మకాలు నమోదయ్యాయి. ఒక రోజు ఏకంగా రూ.10 లక్షలు కేవలం ఒకే కౌంటరు నుంచి ఆదాయం వచ్చింది.తాజాగా శనివారం రూ.50 టికెట్ కౌంటర్లో పని చేసే ఒప్పంద ఉద్యోగి ఐదుగురు భక్తుల నుంచి నగదు తీసుకుని టికెట్లు ఇవ్వకుండానే క్యూ లైన్‌లోకి పంపాడు.ఈసారి కూడా డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్యే మహాద్వారం వద్ద ఆ భక్తులను అడ్డుకున్నారు.ఈసారి కూడా కఠిన చర్యలు తీసుకోవడం వదిలేసి ఆ ఒప్పంద ఉద్యోగిని పాతాళ గణపతి వద్దకు బదిలీ చేసి సర్దేశారు.ఇంత బాహాటంగా అవినీతి జరుగుతున్నా టికెట్ల తనిఖీ కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఎందుకు ఏర్పాటు చేయడం లేదన్న ప్రశ్నలు విన్పిస్తున్నాయి.



ఎస్ఈబీలో పలువురి బదిలీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 20: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)లో పలువురు సీఐలు, ఎస్ఐలు బదిలీ అయ్యారు.తిరుపతి రూరల్ సీఐ కేవీఎస్ ఫణీంద్ర తాడిపత్రికి, చంద్రగిరి సీఐ లీలారాణి కడప జిల్లా ఎర్రగుంట్లకు బదిలీ అయ్యారు. పుత్తూరు సీఐ ఎస్. కృష్ణ అనంతపురం బదిలీ కాగా శ్రీకాళహస్తి సీఐ వెంకట పవన్ కుమార్ రాజంపేటకు, తిరుమల సీఐ తిరుమలయ్య కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. తిరుపతి ఇంటెలిజెన్స్ సీఐ శ్రీనివాసరెడ్డిని పెనుగొండకు,తిరుపతి అర్బన్ సీఐ సి. నాగరాజరెడ్డిని జిల్లా టాస్క్‌ఫోర్స్ విభాగానికి ,అక్కడ పనిచేస్తున్న సీఐ హేమంత్‌కుమార్‌ను ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేశారు.గుంటూరు-1 ఎస్ఈబీ సీఐగా పనిచేస్తున్న ఎం. రమేష్ గూడూరుకు రానుండగా, చీరాల సీఐ కె. సోమయ్య సూళ్లూరుపేటకు, గిద్దలూరు సీఐ ఇ.అరుణ కుమారి నాయుడుపేటకు,క్రోసూరు సీఐ కె. వినయ్‌కుమార్ వెంకటగిరికి బదిలీపై రానున్నారు.

ఎస్ఐల బదిలీ

తిరుపతి అర్బన్ ఎస్ఐ కె. సుబ్రమణ్యం కడప జిల్లా ఎర్రగుంట్లకు, తిరుపతి రూరల్ ఎస్ఐ ఎ.భాస్కర్ అన్నమయ్య జిల్లా కోడూరుకు, చంద్రగిరి ఎస్ఐ బి. చైతన్య చిత్తూరు జిల్లా పులిచెర్లకు, పుత్తూరు ఎస్ఐ ఎ. నాగరాజు కార్వేటి నగరానికి బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తి ఎస్ఐ బి. మోహన్‌కృష్ణ నంద్యాల జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు, తిరుమల ఎస్ఐ ఎం. రమణ కడప జిల్లా ఎస్ఈబీ ఇంటెలిజెన్స్‌కు, తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పీవీ నరసింహులు నంద్యాల జిల్లా కోవెలకుంట్లకు బదిలీ అయ్యారు. తిరుపతి ఇంటెలిజెన్స్ ఎస్ఐ ఎం. మురళి రాయచోటికి , గూడూరు డివిజన్ బీవీ పాళెం చెక్‌పోస్టులో పనిచేస్తున్న ఎస్ఐ ఎస్. మోజెస్ గూడూరుకు బదిలీ అయ్యారు.జిల్లాయేతర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఏడుగురు ఎస్ఐలు బదిలీపై గూడూరు డివిజన్‌కు రానున్నారు. మాచెర్ల ఎస్ఐ ఎం. జయరావు వాకాడుకు, పొందుగుల చెక్‌పోస్టు ఎస్ఐలు సోమ ఆంజనేయులు సూళ్లూరుపేటకు, పి. మహబూబ్‌వలి వెంకటగిరికి, ఒంగోలు ఇంటెలిజెన్స్ విభాగం ఎస్ఐ ఎస్. మునీర్ అహ్మద్ నాయుడుపేటకు నెల్లూరు జిల్లా కోవూరు ఎస్ఐ తలుపుల శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాళెం ఎస్ఐ ఎం. అంజయ్య, కావలి ఎస్ఐ డి. శ్రీధర్ బీవీ పాళెం చెక్‌పోస్టుకు బదిలీ అయ్యారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బస్సుయాత్ర కోసం ట్రాఫిక్ ఆంక్షలు
ఒక్కరోజు ముందే రోడ్ల మూసివేత


ఎల్ఐసీ రోడ్డుకు అడ్డంగా పెట్టిన బ్యారికేడ్లు

నాయుడుపేట టౌన్, జనవరి 20: పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు సామాజిక సాధికారిక బస్సుయాత్ర నిర్వహించేందుకు వైసీపీ నేతలు ఏర్పాట్లు చేపట్టారు. ఇందుకోసం స్థానిక విజయగణపతి దేవాలయం నుంచి పడమటివీధి, టవర్‌క్లాక్ సెంటర్, దర్గారోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు బస్సుయాత్ర రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. పాత బస్టాండ్ వద్ద బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. అయితే పోలీసులు అత్యుత్సాహం చూపుతూ శనివారం మధ్యాహ్నమే రోడ్లను బ్లాక్ చేస్తూ ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న రైల్వేస్టేషన్ రోడ్డులోనూ ఆంక్షలు విధించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేని ఎల్ఐసీ రోడ్డును కూడా బ్లాక్ చేయడం విమర్శలకు దారితీసింది.

ఇన్‌ఛార్జి డీటీవోగా ఆదినారాయణ



గూడూరు, జనవరి 20: తిరుపతి జిల్లా ఇన్‌చార్జి రవాణా శాఖ అధికారిగా ఆదినారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీటీవోగా విధులు నిర్వహించిన సీతారామిరెడ్డి ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. గూడూరు ఆర్టీవోగా పనిచేస్తున్న ఆదినారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

జాతరను తలపించిన చంద్రబాబు సభ: కురుగొండ్ల


సమావేశంలో మాట్లాడుతున్న కురుగొండ్ల

వెంకటగిరి, జనవరి 20: వెంకటగిరిలో శుక్రవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు నిర్వహించిన రా.. కదిలిరా... సభ జాతరను తలపించిందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సభను జయప్రదం చేసినందుకు తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సభపై వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. వెంకటగిరి నుంచి గెలిచేది కూడా తానేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గూడూరు వెంకటేశ్వర్లు, పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాథ నాయుడు, నరసింహులు, మచ్చల వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకులకు అవార్డులు


అవార్డులు అందుకున్న ప్రజాసేవకులు

వాకాడు, జనవరి 20: మిచౌంగ్ తుఫాన్ సమయంలో సేవలందించిన వారికి రాజస్థాన్‌కు చెందిన జ్ఞానోదయ ఫౌండేషన్ అవార్డులు అందజేసింది. గత ఏడాది డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫాన్‌తో వాకాడు మండలంలోని పలు గ్రామాలు అతలాకుతలమయ్యాయి. ఆ సమయంలో బాధితులకు అండగా నిలిచి సేలందించిన వాకాడుకు చెందిన పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డికి రాజస్థాన్‌కు చెందిన జ్ఞానోదయ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ అచీవర్ అవార్డు, మండలంలోని బాలిరెడ్డిపాళెం రామాలయ ప్రధాన అర్చకుడు దీవి అనంతాచార్యులకు వరల్డ్ బుక్‌ఆఫ్ రికార్డు సంస్థ మహాత్మాగాంధీ మెమోరియల్ అవార్డును, మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డికి సహార చారిటబుల్ ట్రస్టు సంస్థ రియల్ కార్ ఆఫ్‌ది ఇయర్ అవార్డు అందజేసింది. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వకుంట భరత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి దామా విజయకుమార్, రాష్ట్ర పరిశీలకుడు తిరుమలశెట్టి కోటేశ్వరరావు శనివారం ప్రజాసేవకులకు అవార్డులు అందజేసి సత్కరించారు.

బలిజ ఉద్యోగుల సమావేశాన్ని విజయవంతం చేయండి


సమావేశమైన బీస్ నాయకులు

గూడూరు, జనవరి 20: స్థానిక రెండో పట్టణ పరిధిలోని కాస్మో పాలిటిన్ క్లబ్‌లో ఈనెల 28వ తేదీన బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవాసమితి (బీస్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న బలిజ ఉద్యోగుల, బలిజ సంఘీయుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక త్యాగరాజవీధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో బీస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సారంగం శ్రీనివాసులు, శేషయ్య, సాయికళ్యాణ్, జగదీష్, ఎంవీరమణయ్య, వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేయండి: రాంకుమార్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాంకుమార్‌రెడ్డి

గూడూరు, జనవరి 20: రానున్న ఎన్నికల్లో వైసీపీ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక సనత్‌నగర్‌లోని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు నివాసం వద్ద నియోజకవర్గ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గూడూరు నియోజకవర్గ కన్వీనర్‌గా మేరిగ మురళీధర్‌రావును ప్రకటించడం జరిగిందని, నాయకులందరూ ఆయనకు సహకరించి రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ మేరిగ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధిష్టానం సమన్వయ కర్తగా ప్రకటించిందని, అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో పొణకా దేవసేనమ్మ, ధనుంజయరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, బొమిడి శ్రీనివాసులు, మీరారెడ్డి, బత్తిని విజయ్‌కుమార్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

26నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

సూళ్లూరుపేట, జనవరి 20: ఆలయాల సంస్కృతి, సంప్రదాయాల వ్యాప్తికోసం దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 1 వరకు తడ, సూళ్లూరుపేటట మండలాల్లో ధర్మప్రచార వారోత్సవాలు జరుగుతాయని చెంగాళమ్మ ఆలయ ఈవో శ్రీనివాసుల రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 26న తడ, 27న మాంబట్టు, 28న మన్నారుపోలూరు, 29న వాటంబేడు, 30న కోటపోలూరు, 31న సూళ్లూరుపేట పట్టణం, ఫిబ్రవరి 1న చెంగాళమ్మ ఆలయంలో జరుగుతుందన్నారు. భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేత


శ్రీనివాసులుకు టీడీపీ కండువా కప్పుతున్న నెలవల

పెళ్లకూరు, జనవరి 20: పెళ్లకూరు మండలంలోని కానూరు గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన బీసీ నేత బత్తల శ్రీనివాసులు టీడీపీలో చేరారు. శనివారం సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు ప్రసాద్ నాయుడు, శేఖర్‌నాయుడు, సుబ్బరామయ్య, వెంకటేశ్వర్లు, గురవయ్య, ప్రసాద్, పరుశురాం, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టి తొలగించండి


అధ్వానంగా ఉన్న రోడ్డు

గూడూరు, జనవరి 20: స్థానిక కోనేటిమిట్టలో రోడ్డుపై మట్టి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో ఓ ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీకి చెందిన సిబ్బంది పైపులైన్ పనుల కోసం రోడ్డును తవ్వి పనులు పూర్తి చేశారు. అయితే మట్టిని తొలగించకపోవడంతో రోడ్డుపై మట్టి పేరుకుపోయి దారి కుంచించుకు పోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో మట్టి దిబ్బలు కనిపించక వృద్ధులు, చిన్నారులు, వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని, అధికారులు స్పందించి మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కోటలో విద్యానగర్ మార్గంలో రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీలు - వెంకటగిరిలో పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన

రోడ్డెక్కిన అంగన్వాడీలు
రాస్తారోకోలు, మానవహారాలతో ఆందోళన

వెంకటగిరి, జనవరి 18: తమ డిమాండ్ల సాధన కోసం 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు శనివారం రోడ్డెక్కారు. రహదారులపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. మానవహారాలు ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వెంకటగిరి పట్టణంలోని బంగారుపేట వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలు శనివారం రాపూరు క్రాస్ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అంగన్వాడీల ఆందోళనను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు సీఐటీయూ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంగన్వాడీ కార్యకర్తలు రాలీగా స్టేషన్ వద్దకు చేరుకొని ధర్నా చేపట్టారు. సీఐటీయూ నాయకులను పోలీసులు వదిలేయడంతో అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా విరమించి దీక్షా శిబిరం వద్దకు చేరుకొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, స్వరూపారాణి, సుభాషిణి, మంజుల, ఐఎఫ్‌టీయూ నాయకులు మమ్ముటాబేగం, లక్ష్మీప్రసన్న, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: అంగన్వాడీలకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 40వ రోజు కొనసాగింది. వారి దీక్షకు తెలుగు మహిళా నేతలు, తెలుగు యువత, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం దీక్షా శిబిరం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి అంగన్వాడీలు మానవహారం ఏర్పాటు చేసి రాస్తారోకో చేపట్టారు. ఇందులో తెలుగు మహిళలు, టీడీపీ, వామపక్షాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కల్పన, శ్రీదేవి, సుధా, సునీల్, సందీప్, సాయి, పార్వతయ్య, దయాకర్, వెంకటేష్, శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, మణి, చంద్రయ్య, ప్రభాకర్, శశికుమార్, ఇంద్రావతి, ప్రభావతి, మునికుమారి, మణెమ్మ, లక్ష్మి, స్వరూప్, ఇంద్రవర్ధన్ పాల్గొన్నారు.

నాయుడుపేట: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం అంగన్వాడీలు, సీఐటీయూ నాయకులతో కలసి నినాదాలు చేస్తూ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సంఘం ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ మాట్లాడుతూ 40రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకుండా కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు చాపల వెంకటేశ్వర్లు, నాయకులు ముకుంద తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: ప్రభుత్వం బెదిరింపులను మానుకొని అంగన్వాడీల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. 40 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన అంగన్వాడీలు హోలీక్రాస్ కూడలి వద్దకు చేరుకొని జాతీయ రహదారి పై రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో గంటసేపు జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు ఆగిపోయాయి. పోలీసులు అక్కడకు చేరుకొని అంగన్వాడీలకు సర్దిచెప్పారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే వరకు ఉద్యమం ఆగదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు హైమావతి, సీఐటీయూ నాయకులు పద్మనాభయ్య, అల్లెయ్య, లక్ష్మయ్య, రియాజ్ పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట 40 రోజులుగా సమ్మె చేస్తున్న కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు శనివారం క్రాస్‌రోడ్డులో బైఠాయించి ఆందోళన చేపట్టారు. అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పద్మలీల, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ప్రాజెక్టు కార్యాలయం నుంచి క్రాస్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కోట, విద్యానగర్ మార్గంలో రెండు గంటలపాటు రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



గూడూరు టవర్‌క్లాక్ సెంటర్ వద్ద, నాయుడుపేటలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్వాడీలు

దళితుల ఓట్ల కోసమే జగన్ నాటకాలు: నెలవల


సమావేశంలో మాట్లాడుతున్న నెలవల, విజయభాస్కర్‌రెడ్డి

నాయుడుపేట టౌన్, జనవరి 20: దళితుల ఓట్ల కోసం సీఎం జగన్ నాటకాలు ఆడుతున్నారని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో జగన్ ఏనాడూ దళితుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోలేదన్నారు. పైగా టీడీపీ హయాంలోని పథకాలను రద్దు చేసి పేదల కడుపుకొట్టారని విమర్శించారు. ఎస్సీలకు రావాల్సిన నిధులను దారి మళ్లించడమే కాకుండా వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడలేదన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య పథకం ప్రవేశపెట్టి ఎస్సీలు విదేశాల్లో చదువుకునేలా చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. 2016లోనే 105 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు తీర్మానం చేసి పాటు 25ఎకరాల భూమితో పాటు రూ.100 కోట్లు కేటాయించిన విషయం గుర్తుచేశారు. వైసీపీలో ఎమ్మెల్యే టిక్కెట్ల కేటాయింపులో దళితులకు అన్యాయం చేస్తూ, ఎన్నికల్లో ఓట్ల కోసం జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. లక్షల కోట్ల ఆస్తిపరుడైన జగన్ శుక్రవారం అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా పేదలకు, ధనికులకు జరిగే సమరం అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో జగన్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. టీడీపీని గెలిపించి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వెంకటగిరిలో జరిగిన రా.. కదలిరా.. సభలో పాల్గొన్న అశేష ప్రజానీకమే ఇందుకు నిదర్శనమని నెలవల అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరామ్ ప్రసాద్, విజయకుమార్ నాయుడు, గూడూరు సుధీర్‌రెడ్డి, పసల గంగాప్రసాద్, ప్రసాద్‌నాయుడు, అవధానం సుధీర్, మాజీ జడ్పీటీసీ రత్నయ్య, కిష్టయ్య, దార్ల రాజేంద్ర, సుజాతమ్మ, శ్రీనివాసులు, మైలారి రాజశేఖర్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగివుండాలి


సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి లోకనాథం

గూడూరు, జనవరి 20: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగివుండాలని న్యాయమూర్తి లోకనాథం అన్నారు. శనివారం మండలంలోని చెన్నూరు గిరిజనకాలనీలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, తల్లిదండ్రులందరూ తమ పిల్లలను చదివించాలన్నారు. గిరిజనులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, పార్వతయ్య, మెహబూబ్‌బాషా, రామసుబ్బయ్య, వాసు, బాలకృష్ణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కొరిడి - పేర్నాడు మధ్య తారు రోడ్డు నిర్మించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న తీరప్రాంత గ్రామాల యువకులు

సూళ్లూరుపేట, జనవరి 20: కొరిడి -పేర్నాడు మార్గంలో తారురోడ్డు నిర్మించాలని తీరప్రాంత గ్రామాలకు చెందిన యువకులు శనివారం తహసీల్దారు రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పక్షుల సంరక్షణ పేరుతో తమ గ్రామాలకు తారురోడ్డు నిర్మాణం జరగకుండా అడ్డుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని తారురోడ్డు నిర్మాణానికి అనుమతి ఇచ్చేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాని తహసీల్దారును కోరారు.

రెండో రోజూ కులగణన

కోట, జనవరి 20: మండలంలోని రుద్రవరం, మైక్రోటవర్ కాలనీల్లో రెండవ రోజు శనివారం కులగణన జరిగింది. ఎంపీడీవో భవానీ, సూపర్ వైజర్ రత్నయ్య ఇంటింటా తిరిగి కుటుంబసభ్యుల వివరాలను యాప్‌లో పొందుపరిచారు.

గొబ్బెమ్మల గ్రామోత్సవం

కోట, జనవరి 20: కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మకాలనీ, గూడలి పంచాయతీలోని కొండమిట్ట కాలనీలో శనివారం గొబ్బెమ్మల గ్రామోత్సవం జరిగింది. గొబ్బెమ్మల విగ్రహాలను ఆయా గ్రామాల పురవీధుల్లో ఊరేగించారు. స్థానికులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మేళతాళాల నడుమ గూడలి స్వర్ణముఖినదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

వాటర్ ప్లాంటు ప్రారంభం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సాయికృష్ణయాచేంద్ర

వెంకటగిరిటౌన్, జనవరి 20: శ్రీనివాస సేవా సంస్థ(టీవీఎస్) సేవలు అభినందనీయమని ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణయాచేంద్ర అన్నారు. శనివారం మండల పరిధిలోని నీలకంఠ పురం ఎస్టీ కాలనీలో రూ.6.26 లక్షలతో శ్రీనివాస సేవా సంస్థ ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్లును ప్రారంభించారు. టీవీఎస్ నిర్వహకుడు పళని స్వామి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

కోట, జనవరి 20: మండల పరిధిలోని సిద్ధవరంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. ముందుగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు దువ్వూరు గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, కోటిరెడ్డి, నిరంజన్, ధ్రువకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

చిల్లకూరు, జనవరి 20: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అభిషేకం, రాత్రికి పల్లకీసేవ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

కాంగ్రెస్ గాలివీస్తోంది: చింతా మోహన్


ప్రచారం నిర్వహిస్తున్న చింతా మోహన్

గూడూరు, జనవరి 20: రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో 130 అంసెబ్లీ స్థానాలలో విజయం సాధిస్తుందని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. శనివారం స్థానిక అశోక్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దుగరాజపట్నం పోర్టు మంజూరు చేస్తే టీడీపీ, బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలు నిర్మాణం చేపట్టకుండా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. మన్నవరంలో బెల్ పరిశ్రమను మంజూరు చేస్తే దానినీ గాలికి వదిలేశాయన్నారు. కాంగ్రెస్‌తో పేదల సంక్షేమం సాధ్యమని, రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చింతా మోహన్ కుమార్తె సీనా, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి, పూల చంద్రశేఖర్, వేమయ్య, నాగభూషణం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

సూళ్లూరుపేట, జనవరి20: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని చింతా మోహన్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో ఇంటింటా తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, ఈసారి ఎన్నికల్లో మార్పు తథ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందనమూడి శివ, కన్నంబాకం హరికృష్ణ పాల్గొన్నారు.

పోలీసులకు ప్రశంసాపత్రాలు


డీఐజీ అమ్మిరెడ్డి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ దయాకర్

నాయుడుపేట టౌన్, జనవరి 20: నాయుడుపేట అర్బన్ పోలీసుస్టేషనులో పనిచేస్తున్న ఎస్‌ఐ రఘునాథ్‌తో పాటు కానిస్టేబుళ్లు కరీమ్, దయాకర్, మస్తాన్ డీఐజీ అమ్మిరెడ్డి చేతులమీదుగా ప్రసంశాపత్రాలు అందుకున్నారు. చోరీకి గురైన మోటారు సైకిళ్ల రికవరీలో ప్రతిభ కనపరచినందుకు వీరికి తిరుపతి ఎస్పీ కార్యాలయంలో శనివారం డీఐజీ ప్రసంశాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్యాలెండర్ ఆవిష్కరణ



గూడూరు, జనవరి 20: జనసేన క్యాలెండర్‌ను ఆ పార్టీ నాయకుడు కొట్టే వెంకటేశ్వర్లు శనివారం ఆవిష్కరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యక్రమంలో జనసేన ఉమ్మడినెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్, మోహన్, ఇంద్రవర్ధన్, స్వరూప్, సాయి, సనత్, శివ, వసంత్, పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కోట, జనవరి 20: పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ కాలనీ, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, చిట్టేడులో గల ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీలక్ష్మమ్మ కాలనీలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు సాయిబాబా ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు జరిపారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.